
వార్త
ఆదివారం
25 ఫిబ్రవరి, 2024




# మన భారత 'రత్నా'లు

# అనుష్క క్రిష్ ప్రాజెక్ట్ టైటిల్ ఫిక్స్?



టాలీవుడ్‌లో మంచి క్రేజ్, మార్కెట్ వున్న స్టార్ కథానాయికల్లో అనుష్కశెట్టి ఒకరు. కొంత గ్యాప్ తరువాత ఆమె చేసిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో సాలిడ్ కం బ్యాక్ అందుకోగా, ఈ సినిమా తరువాత మరో ప్రాజెక్ట్ ఒకే చేసినట్టు సమాచారం. దర్శకుడు క్రిష్ జాగర్లమూడితో తన తరువాత సినిమా ఉండగా ఈ సినిమాకి 'శీలావతి' అనే టైటిల్‌ని లాక్ చేసినట్టుగా తెలుస్తోంది. దీంతో క్రిష్ అనుష్కతో మంచి ఆసక్తికర సబ్జెక్ట్ చేయబోతున్నట్లు అనిపిస్తుంది. ఈ చిత్రంలో తమిళ నటుడు విక్రమ్‌ప్రభు అనుష్క సరసన నటించనుండగా ఈ చిత్రం షూటింగ్ త్వరలో మొదలు కానుంది.

## తారాతీరం

# నితిన్ సినిమాలో సంజయ్ దత్



'ఛలో', 'భీష్మ' సినిమాలతో తన ఖాతాలో భారీ విజయాలను నమోదు చేసుకున్న వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ కథానాయకుడుగా మరో సినిమా వస్తోంది. ఇందులో ఓ ప్రత్యేక పాత్ర ఉందని, ఆ పాత్రలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ నటించబోతున్నట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ పాత్రలో సంజయ్‌దత్‌ను తీసుకున్నట్లు తెలుస్తోంది. 'భీష్మ', 'ఛలో' సినిమాల్లోని ఫన్ కంటే ఈ చిత్రంలో ఫన్ ఇంకా బాగుంటుందట. అలాగే ఈ సినిమాలో హీరో- హీరోయిన్‌ల మధ్య లవ్ ట్రాక్ కూడా ఫుల్ ఎంటర్‌టైన్‌గా ఉంటుందని సమాచారం. మైత్రీ మూవీ మేకర్స్ భారీ తారాగణంతో భారీ స్థాయిలో నిర్మించనుంది. 'భీష్మ' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీ వసూళ్లను సాధించి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. దాంతో వెంకీ కుడుముల- నితిన్ సినిమాపై ప్రేక్షకుల్లో కూడా ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమా ఏ రేంజ్‌లో హిట్ కొడుతుందో చూడాలి మరి!

ఆదివారం వార్త

25 ఫిబ్రవరి, 2024

## మంచి ముత్యాలు

మనసును చలింపచేసే అన్ని అవలక్షణాలను
మనం ఎప్పుడు దూరం చేస్తామో,
అప్పుడు సంతోషాన్ని సొంతం చేసుకోగలం

- అనుభవానంద స్వాములు

## విషయ విశేషం


మరో కొత్త భూమి!... 4

'సంఘీ'భావం....5

అవినీతి అధికారులకు శిక్షలు ఏవి?

కవర్ స్టోరీ..6

మన భారత 'రత్నా'లు

చీమల చట్నీ...11

ఈవారం కవిత్వం..12

తీర్పు

పిల్లల పెంపకం..14

కుక్కలతో తిప్పలు.....18

కథ.. 20

పేపర్‌బాయ్

సాహిత్యం..23

సాహితీ ప్రస్థానంలో 'పురిపండా'

పర్యాటకుల్ని ఆకర్షిస్తున్న అలాస్కా గల్ఫ్..26

ద్వారాలు ఎన్ని ఉండాలి?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### ఫౌంటెయిన్‌లా వజ్రాలు



'వజ్రాలు..ఫౌంటెయిన్ నీళ్లలా ఎగసిపడటమేంటీ?' అనిపిస్తోంది కదూ. ఒకప్పుడు మన గోల్కొండ రాజ్యం వజ్రాలకి నెలవు. ఇప్పుడేమో అవి దక్షిణాఫ్రికాలోనే ఎక్కువగా దొరుకుతున్నాయి. అసలు ఈ ప్రాంతాల్లో మాత్రమే వజ్రాల నిక్షేపాలు ఎలా వచ్చాయి..అన్న సందేహం కలిగింది శాస్త్రవేత్తలకి. సాధారణంగా వజ్రాలు భూమికి 250 కిలోమీటర్ల లోతులో ఉన్న అగ్నిగోళంలాంటి 'మాంటెల్' అనే ప్రాంతంలో పుడతాయంటారు. అవి అక్కడి నుంచి ఎలా వచ్చాయీ ఎందుకొచ్చాయీ అన్నది ఇప్పటిదాకా తేలలేదు. దీనిపైన ఇంగ్లండుకి చెందిన సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పరిశోధనకి దిగారు. ఇందుకోసం ల్యాబుల్లో 50కోట్ల సంవత్సరాల నాటి భూమి వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. వాళ్ల పరిశోధనలు తేల్చిన విషయం ఇది. 'ప్రస్తుతం భూమిపైన ఉన్నఖండాలన్నీ ఒకప్పుడు ఓ పెద్ద ముద్దగా కలిసుండేవి. దానిపేరు గోండ్వానా. అక్కడి నుంచే భారత ఉపఖండం, ఆఫ్రికా, వంటివి విడిపోయి దూరమయ్యాయి. అప్పటిదాకా దగ్గరున్నవి కాస్త దూరమైపోతే వాటికింద భూఫలకాలు (టెక్టానిక్ ప్లేట్స్) కదులుతాయి కదా! అలా కదిలినప్పుడే మామటెల్‌పైన తీవ్రమైన ఒత్తిడి ఏర్పడి అగ్నిపర్వతంలా పేలి వజ్రాలు ఓ ఫౌంటెయిన్‌లా భూమిపై పారి చిమ్ముకొచ్చాయుట. అందుకే గోండ్వానా నుంచి దూరమైన ఆసియా, ఆఫ్రికాల్లో ఇవి ఉంటున్నాయని తేల్చారు శాస్త్రవేత్తలు. భవిష్యత్తుల్లో మరెన్నో వజ్రాల గనుల్ని సులభంగా వెతకడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందని చెబుతున్నారు.

### జోక్స్..జోక్స్..

డాక్టర్: అర్జెంట్‌గా ఆసుపత్రిలో చేరాలి.
రోగి: ఇక్కడ వైఫై సదుపాయం ఉందా సార్?
డాక్టర్: వైఫై కాదు, నీవైఫ్‌నే నీవద్ద ఉంచే ఏర్పాటు చేస్తాం.
రోగి: అయితే చచ్చినా నే చేరను..నాకు వైఫ్‌కాదు వైఫైకావాలి.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# మరో కొత్త భూమి!

**భూమి ఆయుష్షు ఏటికేడు తగ్గుతూ వస్తోంది. వనరులూ తగ్గుతూ వస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకునే మన భూమిలాంటి నివాసయోగ్య గ్రహాల కోసం ఖగోళ శాస్త్రవేత్తలు చాలాకాలంగా అన్వేషిస్తూనే ఉన్నారు.**

ఒకవేళ భవిష్యత్తులో ఎప్పుడైనా భూమి నివసించటానికి పనికిరాకుండాపోతే, మానవజాతి అంతరించకుండా చూడటం దీని ఉద్దేశం. ఈ నేపథ్యంలో అమెరికా అంతరిక్ష సంస్థ నాసా శాస్త్రవేత్తలు 'భారీ భూమి'ని (సూపర్ ఎర్త్) గుర్తించారు. దీని పేరు టీఓఐ-715 బీ. జీవుల మనుగడకు బాగా వీలు కల్పించగలదని భావిస్తున్నారు. ఇది మన భూమి నుంచి 137 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీని వెడల్పు భూమి కన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ. తన నక్షత్రం చుట్టూ 19 రోజులకు ఒకసారి తిరుగుతుంది. ఎర్రటి మరుగుజ్జు నక్షత్రాల కోవలోకి వచ్చే ఈ నక్షత్రం మన సూర్యుడి కన్నా చల్లగా ఉంటుంది. అందువల్ల నక్షత్రానికి సమీపంలోకి వచ్చినా నివాసయోగంగా, భద్రంగానే ఉంటుంది. కాబట్టి టీఓఐ-715బీ ఉపరితల ఉష్ణోగ్రత నీరు ద్రవరూపంలో ఉండటానికి వీలు కల్పిస్తుంది. ఇది ప్రాణుల మనుగడకు అత్యంత అవసరం. ఆక్సిజన్ వంటి ఇతర పోషకాలూ దీని నుంచి లభిస్తాయి. అయితే తన నక్షత్రం నుంచి నివాసయోగ్య ప్రాంతంలో ఉన్నంతమాత్రాన అక్కడ కచ్చితంగా నీరు, జీవం ఉందని చెప్పలేం. ఇందులో గ్రహం ద్రవ్యరాశి, వాతావరణం వంటివీ కీలక పాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు ద్రవ్యరాశి మితిమీరితే తీవ్ర గురుత్వాకర్షణ నీటిని అంతరిక్షంలోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటుంది. వాతావరణం లేకపోతే ఉపరితల పర్యావరణం కఠినంగా ఉంటుంది. ఇది నీటిని నద్రవరూపంలో ఉండనీయకుండా చేస్తుంది. ఒకవేళ గ్రహం అగ్నిపర్వతాలతో నిండి ఉన్నట్టయితే వాతావరణం విషతుల్యం అవుతుంది. ప్రాణులు పుట్టకుండా చేస్తుంది. అందుకే జేమ్స్ వెబ్‌సైట్ టెలిస్కోప్ సాయంతో టీఓఐ-715 బీని ఇంకాస్త లోతుగా అధ్యయనం చేయాలని నాసా సంకల్పించింది.


**సూపర్ ఎర్త్ అంటే?**

భూమి కన్నా పెద్దగా, నెప్ట్యూన్ కన్నా చిన్నగా ఉండే గ్రహాన్ని సూపర్ ఎర్త్‌గా భావిస్తారు. ఇలాంటివి నక్షత్ర మండలంలో తరచూ కనిపిస్తూనే ఉంటాయి. కానీ వాటి ప్రకృతి, వైవిధ్యాలు ఇంకా మనకు అంతగా అవగతం కాలేదు. కొన్ని సూపర్ ఎర్త్‌లు మన భూమి మాదిరిగా రాళ్లూ రప్పలు, పలుచటి వాతావరణంతో కూడి ఉండొచ్చు. మరికొన్ని నెప్ట్యూలాగా మందమైన వాతావరణంతో కూడిన సముద్రాలతో నిండి ఉండొచ్చు. కొన్నింటికి శని గ్రహం మాదిరిగా నక్షత్రాలు, వలయాలు ఉండొచ్చు. ద్రవ్యరాశి



వంటివి సూపర్ ఎర్త్‌ల ఉపరితల గురుత్వాకర్షణ, ఉష్ణోగ్రతలను నిర్ణయిస్తాయి. ప్రాణుల మనుగడకు ఇవి కీలకం.

**ఎలా గుర్తించారు?:** సమీప నక్షత్రాల చుట్టూ తిరిగే గ్రహాలను శోధించటానికి 2018లో ప్రయోగించిన ట్రాన్సిటింగ్ ఎక్సో ప్లానెట్ సర్వే శాటిలైట్ (టీఈఎస్ఎస్) టీఓఐ-715 బీని కనుగొంది. గ్రహాలు తమ నక్షత్రాలను దాటుకొని వెళ్తున్న ప్పుడు అక్కడ కాంతి మసక బారుతుంది. దీని ఆధారంగానే భారీ భూమిని గుర్తించారు. టీఈఎస్ఎస్ అక్కడే ఈఓఐ-715 సీ అనేమరో నగ్రహం జాడనూ పసిగట్టింది. ఇదీ మన భూమి కన్నా పెద్దదే. తన నక్షత్రా న్ని 10 రోజులకు ఒకసారి చుట్టివస్తుంది. దీని ఉనికి, స్వభావాలను నిర్ధారించటానికి మరింత సమాచారం అవసరం.



# 'సంఘీ' భావం




## అవినీతి అధికారులకు శిక్షలు ఏవీ?

**ప్రభుత్వ** అధికారులుగా పనిచేస్తూ అవినీతికి పాల్పడుతున్న వారికి ఆశించిన మేరకు శిక్షలు పడటం లేదు. అవినీతి నిరోధక శాఖ (ఎసీబీ) అధికారులు ఇలాంటి అధికారులను పట్టుకున్న సమయం లో మీడియాలో పతాక శీర్షికల్లో వార్తలు రావడం మినహా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. చట్టంలోని లొసుగులతో అవినీతి అధికారులు ఈ కేసుల నుంచి బయటపడటమే కాకుండా ఏ సీటులో ఉండి అవినీతికి పాల్పడ్డారో అదే సీటుకు తిరిగి నియమిం చబడుతున్నారు. కొన్ని సందర్భాల్లో అంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చే స్థానాలు వారికి లభిస్తున్నాయి. ఏసీబీ అధికారులు విధినిర్వ హణలో రెండు రకాల కేసులపై దృష్టి సారిస్తూ ఉంటారు. వలపన్ని పట్టుకునే కేసులు, ఆదాయాన్ని మించి ఆస్తులు కలిగిన ప్రభుత్వ సిబ్బంది కేసులు ఉంటాయి. ఏదైనా పనికోసం లంచం అడిగి డబ్బు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి చేరుకుని పట్టుకునే కేసులను ట్రాప్ కేసులుగాను, ఏదైనా అధికారి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉంటే ముందుగా కొంత దర్యాప్తు చేసి ఆ తరువాత ఏకకాలంలో అతని కార్యా లయంలోను, ఇంటిలోను, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించి వివరాలు సేకరించే కేసులను ఆదాయానికి మించి ఆస్తుల కేసులు గా పరిగణిస్తారు. ఏసిబి విభాగం ఏర్పాటుకు 1960 డిసెంబర్‌లో అంకురార్పణ ఏర్పడగా 1961 నుంచి అమలులోకి వచ్చింది. సాధారణంగా ఏసీబీ అంటే కేవలం పోలీసు విభాగం వారే ఉంటారని భావిస్తారు. అయితే ఏసీబీలో అటవీ శాఖ, ఇంజనీరిం గ్, రెవెన్యూ, అకౌంట్స్ విభాగం నిపుణులు ఉంటారు. ట్రాప్, సోదాలు నిర్వహించేది పోలీసులే అయినా ఏసీబీ విభాగం పోలీసు శాఖకు కాకుండా ప్రభుత్వ పరిపాలనా శాఖకు అనుబంధంగా పనిచేస్తుంది. 1988 నాటి అవినీతి నిరోధక చట్టాలను అనుస రించి కేసుల దర్యాప్తు సాగుతోంది. 2008లో కూడా కొన్ని సవరణలు చేసినా అవి నిందితులకు శిక్షపడే స్థాయిలో ఉండటం లేదన్న వాదన ఉంది. ట్రాప్ కేసులను మూడు నెలల్లో, ఆదాయా నికి మించి ఆస్తులు ఉన్న కేసులను ఆరు నెలలోగా ప్రభుత్వం, న్యాయస్థానాల ముందు ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ రెండు రకాల కేసులో ప్రాథమిక స్థాయిలో ఉండే ట్రాప్, సోదాలు విజయవంతంగా పూర్తి చేసినా రెండవ దశ ప్రక్రియలో అధికారు లు వెనుకపడుతున్నారు. ఉదాహరణకు ట్రాప్ కేసులను తీసు కుంటే ఎవరైనా బాధితులు ఒక అధికారి తమను వేధిస్తున్నాడని ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తే అతని సహకారంతో అధికారిని పట్టుకుంటారు. ముందుగా కరెన్సీకి రసాయనం పూస్తారు. అధికారి ఆ డబ్బును చేతిలోకి తీసుకున్న తరువాత సరిగ్గా అదే సమయంలో ఏసీబీ అధికారులను అతన్ని పట్టుకుని చేతులపై నీరు వేసే రంగు మారడం స్పష్టంగా కనిపిస్తుంది. ఒకప్పుడు ఇలాంటి ట్రాప్‌లు కూడా విఫలం అయ్యేవి. సకాలంలో డబ్బు తీసుకున్న వెంటనే అధికారులు రాకపోవడం, ఒక్కొక్క సారి లంచం సొమ్ము తీసుకోక ముందు ప్రవేశించడం వంటి ఘటనలు జరిగేవి. అయితే సెల్‌ఫోన్ వచ్చిన తరువాత ట్రాప్ కేసులు నూటికి నూరు శాతం విజయవంతం చేయగలుగుతున్నారు. ఇక తరువాత కేసును కోర్టులో పెట్టిన తరువాత రుజువుచేయడం సమస్యగా మారుతోంది. ట్రాప్‌కు సహకరించిన బాధితుడు అధికారి పట్టుపడి అరెస్ట్ కావడంతో కోపం తగ్గి తనకెందుకు ఈ కేసుల వ్యవహారం అన్న మానసిక స్థితికి చేరుకుంటాడు. కోర్టు ముందు సాక్ష్యం చెప్పడానికి అంతగా ఆసక్తి చూపడు. మరోపక్క అవినీతికి పాల్పడిన అధికారి నయానో, భయానో, డబ్బు ఇచ్చో సాక్షిని న్యాయస్థానం వద్దకు రాకుండా చూస్తుంటారు. దీనితో కేసు సరైన సాక్ష్యం లేకుండా వీగి పోతుంది. కొన్ని సందర్భాల్లో ట్రాప్ చేసిన అధికారి పదవీవిరమణ చేయడం కాని, వేరే ప్రాంతా నికి వెళ్లడం కాని జరుగుతుంది. ఇలాంటి సమయాల్లో కూడా నిందితులకు శిక్షలు పడవు. మరోపక్క ఈ కేసులు సంవత్సరాల తరబడి సాగుతూ ఉంటాయి. ఎఫ్ఐఆర్‌లో రాసిన విషయాలు, ఆనాడు ట్రాప్ సమయంలో జరిగిన ఘటనలు మరిచిపోతారు. ఏసీబీ కోర్టుల సంఖ్య కేసులకు సరిపడా లేకపోవడంతో విచారణ సంవత్సరాల తరబడి సాగుతూ ఉంటుంది. దీనితో సర్వీసు రూల్స్ ప్రకారం తనను తిరిగి ఉద్యోగంలో తీసుకోవాలని ట్రిబ్యున ల్‌కు ఆశ్రయించి నిందితులు ఉద్యోగాల్లో చేరిపోతారు. సదరు అధికారి మళ్లీ అదేస్థానంలోకి రావడంతో ట్రాప్ చేసి పట్టించిన బాధితులు కూడా అతనితో సర్దుకుపోయే వైఖరిని అవలంభిస్తారు. కేసు నమోదు చేయడానికి, న్యాయస్థానంలో విచారణ జరగడా నికి మధ్య కొన్ని నెలలు వ్యత్యాసం ఉంటుంది. ఈ సమయంలో సదరు నిందితుడు తాను కేసు నుంచి బయటపడటానికి అనేక మార్గాలు అన్వేషించే అవకాశం ఉంటుంది. తాత ముత్తాతల నుంచి వచ్చిన ఆస్తులు, ఇతరుల నుంచి అప్పుగా తీసుకున్న మొత్తాలు, పుట్టింటి నుంచి భార్య తీసుకువచ్చిన బంగారు ఆభరణాలు నాలుగింతలు ఎక్కువ చేసి చూపించే అవకాశం ఉంటుంది. అదేవిధంగా స్థలాలు, ఇళ్లు కొనుగోలు విషయంలో సరైనా ధరను నిర్ధారించే అవకాశం ఉండదు. అధికారిని పట్టుకునే సమయంలో వంద కోట్లు ఆస్తి అదనంగా ఉందని ఏసీబీ చెబితే రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం పది లక్షలు కూడా లేదని అధికారి న్యాయస్థానానికి వివరించే అవకాశం ఉంటుంది. ఇక ఆయన బంధువుల ఇళ్లలో లభించిన వివరాలు ఎవరికి వారు తమవని నిరూపించుకునేలా అధికారి చర్యలు తీసుకుంటారు. దీనితో చివరకు ఆదాయానికి మించి ఆస్తులు లేవని న్యాయస్థానం కేసులు కొట్టి వేస్తుంది. ఏసీబీ చట్టాలను సమూలంగా మార్పులు చేస్తేనే గాని ఆశించిన ఫలితాలు రావు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ





# మన భారత 'రత్నా'లు

కవర్ స్టోరీ


**ఎవివి ప్రసాద్,**
అసోసియేట్ ఎడిటర్, వార్త


**రత్నాలాంటి బిడ్డలుంటే ఏ తల్లి అయినా ఎంతో గర్వపడుతుంది. భరతమాతకు స్వాతంత్ర్యానంతరం అటువంటి 'రత్నా'లు ఇప్పటిదాకా 53మంది. వారందరు వివిధ రంగాలలో దేశాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లినవారు. రాజకీయ, ఆర్థిక, కళారంగాలు, శాస్త్రవిజ్ఞాన సామాజిక సేవలో తరించినవారు వారిలో ఎంతోమంది ఉన్నారు. ఇంకా ఎందరో ఉండి ఉండవచ్చు. సమాజాన్ని ఎంతో ప్రభావితం చేసిన వారు మరి కొందరుకూడా ఉండవచ్చు. కానీ సంవత్సరానికి ఇద్దరు లేదా ముగ్గురు అనే సంప్రదాయం పాటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారం అందిస్తోంది. మధ్యమధ్యలో కొంత విరామం వచ్చినా, 1954 నుంచి పురస్కార పరంపర కొనసాగుతూనే ఉంది. 1977లో జనతా ప్రభుత్వం ఈ అవార్డును రద్దు చేస్తే, 1980లో కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించింది. అన్ని పురస్కారాలను ముసిరినట్లుగానే ఈ అత్యున్నత పురస్కారం కూడా వివాదాలకు అతీతం కాలేకపోయింది. కొందరికి ఇచ్చిన పురస్కారాలు కొన్ని ఆరోపణలకు గురయ్యాయి. వాటి వెనుక రాజకీయ, వివక్ష కూడా వినిపించింది.**

దేశ సర్వోన్నత పౌరపురస్కారమైన 'భారతరత్న' ఈసారి వరుసగా ఐదుగురు ప్రముఖులకు లభించడం విశేషం. సంవత్సరం ఆరంభంలోనే కేవలం రెండు వారాల వ్యవధిలో ఆ ఐదుగురిని ప్రకటించారు. వారిలో నలుగురు దివంగతులే. ప్రస్తుతం 90వ పడిలో ఉన్న బిజెపి అగ్రనేత ఎల్‌కె అద్వానీ పురస్కారానికి ఎంపికకాగా, మాజీ ప్రధాని చరణ్‌సింగ్, మాజీ సిఎం కర్పూరీఠాకూర్, వ్యవసాయశాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ ఈ అరుదైన గౌరవాన్ని అందుకొన్నారు. అందరికంటె విశిష్ట వ్యక్తిగా, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు ఈ అత్యున్నత గౌరవాన్ని ఇప్పటికైనా అందుకోవడం కూడా విశేషమే. రాజకీయ, సాహిత్య, సామాజిక రంగాలలో పివికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ఆయనకు భారతరత్న ఇవ్వాలనే డిమాండ్ చాలా సంవత్సరాల నుంచే ఉంది. కానీ కారణం ఏదైనా, చాలా ఆలస్యంగానైనా ఆయనకు ఈ పురస్కారం లభించింది. 'ఎటూకాని వేళలో ఇప్పుడెందుకిచ్చారు? ఇంతకాలం ఎందుకివ్వలేదు? అనే ప్రశ్నలు కొంతమంది సంధించినా, మొత్తానికి ఇచ్చారు కదా! అనే సంతృప్తినే ఎక్కువమంది వ్యక్తం చేస్తున్నారు. మూడు సంవత్సరాలుగా ఒక్కరికి కూడా ఈ పురస్కారం అందించని కేంద్రం ఒక్కసారిగా ఐదుగురికి పంచి ఒక కొత్తరికార్డును సృష్టించింది.

వివిధ రంగాలలో అత్యున్నత సేవలను అందించి, చిరకాలం కొనియాడే స్థాయిగల విశిష్ట వ్యక్తులను భారతరత్న అలరిస్తుంటుంది. మనదేశంలోని అటువంటి విశిష్టులకేగాక, అంతర్జాతీయంగా ఘనకీర్తినార్జించిన అత్యంత ప్రముఖులను కూడా ఈ పురస్కారంతో గౌరవించడం జరుగుతోంది.

నెల్సన్‌మండేలా, ఖాన్ అబ్దుల్‌గఫార్‌ఖాన్ అటువంటివారే. విదేశీ పౌరసత్వం గల ఇద్దరికి భారతరత్న లభించగా, మదర్‌థెరెసాకు భారతీయ పౌరసత్వం కింద లభించింది. ఇప్పటి వరకు 53మందికి ఈ పురస్కారం లభించినా, వారిలో మహిళలు ఐదుగురు మాత్రమే. అయితే భారతరత్నతో పాటు ప్రపంచ అత్యున్నత పురస్కారమైన 'నోబెల్' బహుమతిని కూడా వారిలో ముగ్గురు అందుకొన్నారు. సర్‌సివి రామన్, మదర్‌థెరెసా, అమర్త్యసేన్‌లు నోబెల్ కూడా సాధించి భారత ప్రతిష్ఠను మరింత ఇనుమడింపచేశారు.



నెల్సన్‌మండేలా



జాకీర్ హుస్సేన్,



చంద్రశేఖర్



సర్‌సివి రామన్



అబ్దుల్‌కలాం



అరుణ అసఫ్ ఆలీ

...

ఏదిఏమైనా 'భారతరత్న' అందుకోవడమంటే నాటికి, నేటికి ప్రపంచవ్యాప్తంగా ఒక సమున్నత గౌరవమే. కేంద్రంలో నరేంద్రమోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేముందు 2014లో ఇద్దరికి వచ్చిన తర్వాత 15లో ఇద్దరికి ఈ పురస్కారం లభించింది. తర్వాత మూడు సంవత్సరాలు ఎవరికీ ప్రకటించకపోయినా, 2019లో మళ్లీ ముగ్గురికి అందించారు. ఆ తర్వాత మళ్లీ నాలుగేళ్ల విరామం. ఇప్పుడు ఆలోటును భర్తీ చేస్తున్నట్లుగా ఒకే దఫా ఐదుగురిని గౌరవించారు.

ప్రముఖ సోషలిస్ట్ నాయకుడు, బిహార్ మాజీముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు ఆయన శతజయంతి సందర్భంగా ఈ సంవత్సరం తొలుత పురస్కారాన్ని ప్రకటిస్తే, తరువాత వరుసగా బిజెపి దిగ్గజం ఎల్‌కె అద్వానీ, ఇద్దరు మాజీ ప్రధానమంత్రులు పివి నరసింహారావు, చరణ్‌సింగ్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు ప్రకటించారు.




బిఆర్ అంబేద్కర్

## తెలుగు ఠీవీ..పివి


తాజాగా భారతరత్న గౌరవానికి ఎంపికైన ఐదుగురు సామాజికంగా అత్యున్నత స్థానానికి ఎదిగిన వారే అయినా వారిలో అగ్రగణ్యులుగా మాజీ ప్రధాని పివి నరసింహారావును చెప్పుకోవచ్చు. 'నీదు మార్గాన నీయంత నేత లేదు' అని చెప్పాలంటే అందుకు పివి మొదటివరుసలో కనిపిస్తారు. తెలంగాణ బిడ్డగా, తెలుగు చాణక్యుడుగా, సాహితీపారంగతునిగా పివి గురించి ఎంత చెప్పినా తక్కువే. 16 భాషలు రావడం కాదు, వాటిలో ప్రావీణ్యం కలిగిన మేధావి ఆయన. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఎంపిగా, ఎమ్మెల్యేగా, సాహితీవేత్తగా ఆయన యేళ్లతరబడి చేసిన కృషి చిరస్మరణీయం. ఆయన దార్శనిక నాయకత్వం వల్ల దేశం ఆర్థికంగా ఎంతో ముందడుగు వేసిందని అందరు కొనియాడారు. పివి ప్రధానమంత్రిగా తీసుకున్న చర్యలు దేశ ఆర్థికాభివృద్ధిలో నవశకానికి నాంది పలికాయి. మన విదేశాంగ విధానం, భాషలు, విద్యారంగానికి చేసిన సేవలు ఆయనలోని బహుముఖ ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. దేశం సంక్లిష్ట సమయంలో ఉండగా, జాతికి దశ, దిశను నిర్దేశించిన రాజనీతిజ్ఞునిగా పివి ప్రతిభ అసాధారణమని చెప్పవచ్చు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వంగరలో 1921 జూన 28న జన్మించిన పాములపర్తి వెంకట నరసింహారావు ఉస్మానియా, బాంబే, నాగ్‌పూర్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించి, 'వందేమాతరం' ఉత్యమంలో కీలకపాత్ర వహించడమేగాక, స్వాతంత్ర్యానికి ముందే దేశ ఉద్యమాలలో పేరు సాధించారు. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1971 నుంచి 73 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న పివి ప్రధాని కాకముందు కేంద్రంలో విదేశీవ్యవహారాలు, రక్షణశాఖలను కూడా నిర్వహించారు. హనుమకొండ ఎంపీగా రెండుసార్లు ఎన్నికైన పివి మహారాష్ట్రలోని రామ్‌టెక్‌నుంచి రెండుసార్లు, నంద్యాల, బరంపురం నుంచి రెండుసార్లు ఎంపిగా ఉన్నారు. 1991లో ప్రధానిగా పదవిని చేపట్టడమేకాక, ఆ సమయంలో ఆర్థికంగా సంక్షుభితస్థితిలో ఉన్న దేశాన్ని తన సంస్కరణలతో గట్టెక్కించి పూర్తికాలం పదవిలో కొనసాగారు. ఆయన ప్రధానమంత్రి పదవిని ఒక క్లిష్టసమయంలో అధిష్ఠించినా, దేశం ఎంత ఆర్థిక సంక్షోభంలో ఉన్నా, తన చాణక్యంతో ఆ సమస్యల నుంచి సమాజాన్ని దారిలోకి తెచ్చారు. ఆర్థిక సంస్కరణల అమలు క్రమంలో ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని ఎన్నో పథకాలకు ఆయన ఆద్యులుగా నిలిచారు కూడా. ప్రధానమంత్రి రోజ్‌గార్‌యోజన, ఎంపిలాడ్స్ పథకం, పార్లమెంట్ స్థాయీ సంఘాల వ్యవస్థ వంటి ప్రయోజనకరమైన నిర్ణయాలు ఆయన తీసుకొన్నవే.

ఆయన తక్షణమే స్పందించే వారు కాదని అప్పట్లో చాలా విమర్శలు వచ్చేవి కానీ, అదే నిజమైతే అన్ని సంస్కరణలు అమలు చేసేవారా? అనిపిస్తుంది. పివి తన మూడున్నరేళ్ల పాలన తర్వాత ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ఆర్థిక సంస్కరణలు అనుకొన్న విధంగా అమలు జరిగి దేశం ముందుకు వెళ్లాలంటే రాజకీయ సుస్థిరత ముఖ్యం. అందుకే ఎన్ని అడ్డంకులు వ చ్చినా నా త్రోవలో నేను సాగుతున్నా' అని తనపై వచ్చిన విమర్శలకు జవాబుగా స్పందించారు. ఇటువంటివి ఎన్నో విదేశాంగ వ్యవహారాల విషయంలో పివి ఒక కొత్త ఒరవడిని సృష్టించారు. ఇజ్రాయెల్‌ను గుర్తించడం, చైనాతో సరిహద్దు సంఘర్షణలను నివారించడం వంటి అంశాలపై ఏకాభిప్రాయసాధనకు ఎంతగానో కృషి చేసి అందరి మెప్పును పొందారు. అమెరికాలో ఆరురోజులు పర్యటించి, ఆ దేశంతో కొత్త సంబంధాలకు తెరతీశారు. అణుపరీక్షలపై నిషేధాన్ని అమలు చేసే సిటిబిటి ఒప్పందంపై అమెరికాను చర్చల్లోకి దింపి, చివరి వరకు ఆ ఒప్పందంపై సంతకం చేయకుండా చాణక్యం నెరపిన పివి దౌత్యనీతి అమోఘం. యాసర్ అరాఫత్‌ను 1992 జనవరిలో భారత్‌కు ఆహ్వానించడం, తర్వాత ఇజ్రాయెల్‌తోనూ సంబంధాలు మెరుగుపరచుకోవడంతో పివి దౌత్యవిధానాలపట్ల ప్రపంచమంతా హర్షం వ్యక్తం చేసింది. సింగపూర్, జపాన్‌వంటి తూర్పు ఆసియా దేశాలతో సంబంధాలను కూడా పివియే పునరుద్ధరించారు. ఆయన అవలంబించిన 'లుక్‌ఈస్ట్' విధానం కూడా మంచి ఫలితాలనిచ్చింది. అప్పటి చైనా ప్రధాని లీపెంగ్ 1991లో భారత్‌రాగా, 1993లో పివి చైనా వెళ్లారు. ఆ సందర్భంలోనే భారత్, చైనా సరిహద్దుల్లో ప్రశాంతతకు సంబంధించి ఉభయదేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అంతర్జాతీయంగానేగాక, దేశీయంగా కూడా ఆయన రాజకీయ చాణక్యం ఎంతో అబ్బురపరుస్తుందనవచ్చు.


బిస్మిల్లాఖాన్

అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్ ప్రతినిధులు కాశ్మీర్ సమస్యను లేవనెత్తకుండా ఉండేందుకు ప్రధాన ప్రతిపక్షమైన భారతీయ జనతాపార్టీని ఉపయోగించుకోవడం పివి బుద్ధికుశలతకు నిదర్శనం. 1991లో ఆస్ట్రేలియాలో యూరోపియన్ పార్లమెంటు నిర్వహించిన సదస్సుకు అప్పటి బిజెపి లోక్‌సభాపక్షనేత, అద్వానీని, కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్‌ను పంపించారు. అలాగే మరో సందర్భంలో 1994లో జెనీవాలో జరిగిన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ సదస్సుకు బిజెపినేత వాజ్‌పేయిని ప్రతినిధిగా పంపారు. ఇలా ప్రతిపక్షంలోని నేతలను కూడా దేశాభివృద్ధిలో భాగస్థులను చేస్తూ, 'కలుపుగోలు'తనంతో ముందుకు సాగడం పివికే చెల్లిందని కూడా చెప్పాలి.


సి.రాజగోపాలాచారి

అణుపరీక్షల ఘనత తర్వాత ప్రధాని అయిన వాజ్‌పేయ్‌గా చెబుతాం కానీ, దానికి కూడా ఆద్యుడు పివియే. 1995 డిసెంబర్‌లోనే అణుపరీక్షలకు పివి రంగం సిద్ధం చేశారు. కానీ ఆ విషయం అమెరికా పసిగట్టిందని తెలిసి వాయిదా వేశారు. తరువాత వాజ్‌పేయ్ ఒకసారి పివికి శ్రద్ధాంజలి ఘటిస్తూ 'అణుపరీక్షల ఘనత నిజానికి పివిదే'. ఆ పరీక్షలకు ఆయనే అంతా సిద్ధం చేసి 'సామగ్రి తయార్‌హై' అని తనకు చెప్పా'రంటూ గుర్తు చేసుకోవడం గమనించవలసిన అంశం.


వాజ్‌పేయి

ఎన్నో రాజకీయ ఒత్తిడితులతో, సమస్యలతో, సంక్షోభాలతో సతమతమవుతున్నా తనకు చిన్నప్పటి నుంచి ఎంతో ఆసక్తిగా అధ్యయనం చేసిన సాహిత్యాన్ని ఆయన వదలకపోవడమేగాక ఎన్నో పుస్తకాలను కూడా స్వయంగా రచించారు. 'కవిసమ్రాట్' విశ్వనాథసత్యనారాయణ 'వేయిపడగలు' నవలను పివి హిందిలోకి 'సహస్రఫణ్' పేరుతో అనువదించడమేగాక ఆ పుస్తకంతో ఎంతో పేరుప్రతిష్టలు కూడా ఆర్జించారు. ఏ దేశం వెళ్తే ఆ దేశభాషలో మాట్లాడడం పివికి వెన్నతో పెట్టిన విద్యగా చెబుతారు. అదే విదేశాంగ విధానంలో ఆయన మరింత సక్సెస్ కావడానికి బాటలు వేసింది. 1980లో ఆయన హవానా పర్యటనకు వెళ్లినపుడు అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి నుంచి ఆయనకు ఒక సందేశం వచ్చిందట. అక్కడున్న అలీన ఉద్యమ నాయకులతో మాట్లాడి, వారి తదుపరి సమావేశాన్ని ఇరాక్‌లో కాకుండా భారత్‌లో పెట్టేలా ఒప్పించాలన్నది దాని సారాంశం. వెంటనే పివి అక్కడున్న క్యూబన్లతో స్పానిష్ భాషలో, ఇరాన్‌వారితో పర్షియన్‌లో, ఇరాక్, ఈజిప్ట్‌వారితో అరబిక్‌లో, ఆఫ్రికా ప్రతినిధులతో ఫ్రెంచి భాషలో పాక్ ప్రతినిధులతో ఉర్దూలో.. ఇలా వారి భాషల్లో మాట్లాడి భారత్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకునేట్లు చేశారట. ఆయన బహుముఖ భాషా ప్రతిభకు ఇంతకంటే నిదర్శనం ఏం ఉంటుంది?


మొరార్జీ దేశాయ్


ప్రఖ్యాత మరాఠా రచయిత హరినారాయణ్ ఆప్టే నవలను 'అబలా జీవితం' పేరుతో తెలుగులోకి అనువదించారు. తెలుగులోని ఎన్నో గొప్ప కవితలను హిందీలోకి, మరికొన్ని భారతీయ భాషల్లోకి అనువదించారు. ఇలా ఆయన చేసిన భాషాసేవ కూడా మరువ లేనిదే. తాను ఎదగడమేగాక, ప్రతిభావంతులను తనతో నడిపించడం పివిలో మెచ్చదగిన మరో అంశంగా చెబుతారు. విశ్వనాథ, సి.నారాయణ రెడ్డికి జ్ఞాన్‌పీఠ్ అవార్డులు, కాళోజీకి 'పద్మవిభూషణ్' పురస్కారాల వెనుక పివి చొరవ ఉన్నదని చెబుతారు.

1972 ఆగస్టు 15న స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా అర్ధరాత్రి అసెంబ్లీలో పివి చేసిన కవితా గానం చూసి ఆయన హృదయం ఎంత కవితాత్మకమోనని అంతా ప్రశంసించారంటే సాహిత్యంలో ఆయనకు గల అవినాభావ సంబంధం అర్థమవుతుంది. ఇంతటి ప్రతిభావంతమైన సుదీర్ఘ జీవితం 83 యేండ్ల వయసులో 2004 డిసెంబర్


లతామంగేష్కర్

23న భౌతికంగా ముగిసినా, 'భారతరత్నం'గా ఆయన చిరంజీవి అని చెప్పాలి.

## ఎల్‌కె అద్వానీ



లౌకిక, హిందూత్వ వాదాలకు లాల్చీ, పైజమా వేస్తే అది లాల్‌కృష్ణ అద్వానీలా ఉంటుందంటారు. అటువంటి విశిష్ట వ్యక్తిత్వం 'భారతరత్న' అందుకొన్న మరో మహనీయుడు అద్వానీది. ఆయన పేరు చెప్పగానే గుర్తొచ్చేవి 'రథయాత్ర'లు. 1990ల నుంచి రెండు దశాబ్దాల పాటు దేశమంతా మార్మోగిన పేరు ఆయనది. ఆయన జరిపిన ఆరు యాత్రల్లో అయోధ్య రథయాత్ర దేశ రాజకీయ ముఖచిత్రాన్నే మార్చివేసింది. బిజెపిని కేవలం రెండు లోక్‌సభ సీట్ల స్థాయి నుంచి తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడంలో వాజ్‌పేయితో పాటు అద్వానీది కీలక పాత్ర అనే చెప్పాలి. ఆ పార్టీకి వారిద్దరిని కృష్ణార్జునులుగా చెబుతారు. వారిద్దరినీ 'భారతరత్నం' వరించడం మరో విశేషం. వాజ్‌పేయికి ఈ పురస్కారం దక్కిన తొమ్మిదేళ్లకు అద్వానీని కూడా వరించింది. బిజెపికి సుదీర్ఘ కాలం అధ్యక్షునిగా కొనసాగిన రికార్డు కూడా ఆయనదే. నేటి పాకిస్థాన్‌లోని కరాచీలో 1927లో జన్మించిన అద్వానీ 14 యేళ్ల వయసులోనే అంటే అంత బాల్యంలోనే ఆరెస్సెస్‌లో చేరి జనసంఘ్ నేతగా ఎదిగారు. తరువాత హిందూ హృదయ సమ్రాట్‌గా దేశ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సముపార్జించారు. అయోధ్యలో బాబ్రీ మసీదు స్థానంలో రామాలయం పునరుద్ధరించాలనే డిమాండ్‌తో 1990 సెప్టెంబర్‌లో గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి ఆయన చేపట్టిన రథయాత్ర రాజకీయంగా అప్పట్లో పెను సంచలనం సృష్టించింది.




జయప్రకాశ్‌నారాయణ్

అరెస్టుతో యాత్ర మధ్యలోనే ఆగినా అది బిజెపికి ఒక గొప్ప టానిక్‌లా పని చేసింది. 1983లో రెండు సీట్లున్న పార్టీ 1991 లోక్‌సభ ఎన్నికల్లో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించిందంటే దాని వెనుక అద్వానీ కృషి అద్వితీయం. 1992లో బాబ్రీ మసీదు విధ్వంసానికి తోడు 93 నుంచి అద్వానీ చేపట్టిన జనాదేశ్, స్వర్ణ జయంతి, భారత్ ఉదయ్, భారత్ సురక్ష వంటి రథయాత్రలు బిజెపిని కేంద్రంలో అధికారానికి చేరువ చేశాయి. చివరికి 1996లో బిజెపి తొలిసారిగా కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ప్రధాని కావాలన్నది ఆయన ఆకాంక్ష. దాని కోసం ఎంతో తపన పడ్డారు కూడా. విరామం లేకుండా పార్టీ రాజకీయాల్లో కృషి చేశారంటే దాని వెనుక ఆయన బలమైన కోరిక అదే. కానీ వాజ్‌పేయి ప్రధాని కావడంతో తనపై గల అతివాద ముద్ర తొలగించుకునే ప్రయత్నం కూడా చేశారు. 2009 ఎన్నికల్లో బిజెపి ప్రధాని అభ్యర్థిగా నిలిచినా పార్టీ పరాజయం పాలవడంతో ఆయన కల నెరవేరలేదు. 2011లో చివరిసారి చేసిన 'జనచేతన' యాత్ర కూడా అంతగా లాభించకపోవడం, తర్వాత రాజకీయాల్లో ఆయన తన పాత్రను తానే తగ్గించుకోవడంతో ఆ తర్వాత బిజెపి అధికారంలోకి వచ్చినా ప్రస్తుతం జరిగే పరిణామాలకు ప్రేక్షక పాత్రనే వహిస్తున్నాయి.



విశ్వేశ్వరయ్య



ఎంఎస్ సుబ్బులక్ష్మి

రైతు జన బాంధవుడు చరణ్‌సింగ్ సాటిలేని రైతునేతగా, రైతు సంక్షేమానికి జీవితాన్ని అంకితం చేసిన ముఖ్యమంత్రిగా, ప్రధానిగా చరణ్‌సింగ్ చేసిన కృషి కూడా అసాధారణమే. ముఖ్యంగా ప్రజాస్వామ్యం పట్ల ఆయనకు గల నిబద్ధతను ఆయనంటే గిట్టనివారు సైతం మెచ్చుకుంటారు.




జవహర్‌లాల్‌నెహ్రూ

1902లో ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో జన్మించిన చరణ్‌సింగ్ ఆగ్రా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేసి తొలుత న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించినా, తర్వాత రాజకీయాల వైపు మొగ్గు చూపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పలుమార్లు అరెస్టవడమేగాక 1937లో తొలిసారిగా యునైటెడ్ ప్రావిన్సెస్ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. స్వాతంత్ర్యా నంతరం వరుసగా ఎన్నికల విజయాలు సాధించి 1951లో మొదటిసారి కేబినెట్ మంత్రిగా కేంద్ర ప్రభుత్వంలోకి అడుగు పెట్టారు. అప్పటి నుంచి ఆయన రాజకీయ జీవితం వడివడిగా ముందుకు సాగింది. కేంద్రంలో వ్యవసాయ మంత్రిగాగా చేపట్టిన వినూత్న పథకాలతో దేశంలోని రైతు బాంధవుడిగా గుర్తింపు పొందారు. తర్వాత ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా రెండు సార్లు చేశారు. ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని దేశ ప్రజల దృష్టిని ఎక్కువగా ఆకర్షించారు. జనతా ప్రభుత్వంలో కేంద్ర హోం మంత్రిగా, ఆర్థిక మంత్రిగా, ఉప ప్రధానిగా వివిధ పదవులను అధిష్ఠించిన చరణ్‌సింగ్ జనతా పార్టీ చీలిక అనంతరం 1979 జులైలో కాంగ్రెస్ మద్దతుతో ప్రధాని అయ్యారు. అయితే వివిధ రాజకీయ పరిమాణాల వల్ల 23 రోజులే ప్రధాని పదవిలో కొనసాగి, తర్వాత 1980 జనవరిదాకా ఆపద్ధర్మ ప్రధానిగా ఉన్నారు. రాజకీయ పదవులు ఎలా ఉన్నా, ఏ పదవిలో ఉన్నా ఆయన రైతు జన సంక్షేమం కోసం పడిన తాపత్రయం, తీసుకొన్న చర్యలు రైతులోకంలో శాశ్వత ముద్ర వేశాయి. గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించ డానికి ఆయన కేంద్ర పదవులలో



వినోబాభావే



జెఆర్‌డి టాటా

ఉండగా చాలా చొరవ చూపారు. వ్యవసాయ రంగం, భూసంస్కరణలు, పేదరిక నిర్మూలనపై పలు పుస్తకాలనుకూడా రచించారు. 1987లో ఆయన మరణానంతరం, జయంతి అయిన డిసెంబర్ 23ను యేటా 'కిసాన్ దివస్'గా పాటిస్తున్నారు.

## 'జన నాయకుడు' కర్పూరీ ఠాకూర్



నాయకత్వ దార్శనికతతో 'జననాయకుడు'గా ముద్ర పడిన కర్పూరీ ఠాకూర్ సోషలిస్టు నేతగా రెండు సార్లు బీహార్ ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఠాకూర్ చేసిన కృషి అనుపమానం.

1924లో బీహార్‌లోని సమస్తిపూవర్ణజిల్లాలో జన్మించిన ఠాకూర్ వరణ వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తి విద్యార్థి దశలోనే ప్రజా జీవితం ఆరంభించారు. 1952లో సోషలిస్ట్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఆయన తన పోరాటం ఉధృతం చేసి తర్వాత మంత్రిగా, ముఖ్యమంత్రిగా ప్రజాదరణ పొందారు. ముఖ్యంగా మద్య నిషేధం అమలు, కుల వివక్షకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఠాకూర్ అందరికీ ఆదర్శప్రాయులయ్యారు. 1988లో ఆయన మరణించడానికి ముందు వరకు సోషలిస్టు విధానాలతోనే జీవితాన్ని కొనసాగించారు. నిరాడంబరతకు ఆయన పెట్టింది పేరు. సొంత ఇల్లు లేని ముఖ్యమంత్రిగా ఆయన్ని చెబుతారు. బీహార్‌లోనేగాక, యావత్ ఉత్తరాది ప్రజానీకంపై ప్రభావం చూపిన నేతగా ఆయన్ని 'భారతరత్న' వరించింది.


## హరిత విప్లవ సారథి స్వామినాథన్




ఆయన్ని స్వామినాథన్ అనడం కంటె దేశ ప్రజల ఆకలి తీర్చిన నారాయణుడంటే సబబనిపిస్తుంది. దేశంలో సరైన పంటల విధానం లేక, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పంటల ఉత్పత్తి లేక దేశ ప్రజలు అలమటిస్తున్న సమయంలో ఒక దిక్సూచిగా, కాంతిరేఖగా తెరపైకి వచ్చినవారు ఎంఎస్ స్వామినాథన్. 1925లో తమిళనాడులోని కుంభకోణంలో జన్మించిన స్వామినాథన్ వైద్య విద్యను మధ్యలోనే వదిలేసి, వ్యవసాయ పరిశోధనలు ఆరంభించారు. ఆయన చేసిన ప్రపంచ స్థాయి పరిశోధనలు హరిత విప్లవానికి దారి తీసి పంటల ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా పెరగడానికి దోహదం చేశాయి. ఆయన చేసిన పరిశోధనలకు గుర్తింపుగా 1989లోనే కేంద్ర ప్రభుత్వం 'పద్మవిభూషణ్' పురస్కారంతో గౌరవించింది. 20వ శతాబ్దంలో అత్యంత ప్రభావ శీల వ్యక్తుల్లో ఒకరిగా 'టైమ్' మేగజైన్ గుర్తించింది. 2023లో మరణించే ముందు వరకు స్వామినాథన్ ప్రపంచ వ్యాప్తంగా వివిధ విశ్వ విద్యాలయాల నుంచి 84 గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారంటే ఆయన విశ్వ ప్రతిభకు కొలమానం ఏముంటుంది! స్వర్గస్థులైన నాలుగు నెలల్లోనే ఆయన్ని కేంద్రం 'భారత రత్న'ను చేసింది.


ఇలా ఇప్పటికి 53 'రత్నా'లలో అందరు నిజంగానే ఎంతో మహానుభావులు. వారిలో భారతరత్నకు ఎంపికైన మాజీ ప్రధానమంత్రులు 8 మంది. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధి, రాజీవ్‌గాంధి, మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, తాజాగా పివి, చరణ్‌సింగ్‌లు. వారుగాక మరెందరో భారతమాత ముద్దుబిడ్డలు ఈ ఘన పురస్కారం అందుకున్నారు. 1954లో తొలుత సి.రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణన్, సివి రామన్, తర్వాత సంవత్సరాలలో వరుసగా భగవాన్‌దాస్, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, గోవింద్ వల్లభ్ పంత్, ధోండో కేశవ్ కర్వే, బిధాన్ చంద్రరాయ్, పురుషోత్తందాస్ టాండన్, బాబూ రాజేంద్రప్రసాద్, జాకీర్ హుస్సేన్, పాండురంగ్‌వామన్ కేన్, వివి గిరి, కె.కామరాజ్, వినోబాభావే, ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్, ఎం.జి.రామచంద్రన్, బి.ఆర్.అంబేద్కర్, నెల్సన్ మండేలా, వల్లభ్ భాయ్ పటేల్, అబుల్ కలాం ఆజాద్, జెఆర్‌డి టాటా, సత్యజిత్‌రే, గుల్జారీలాల్ నందా, అరుణా ఆసఫ్ అలీ, ఎపిజె అబ్దుల్ కలాం, ఎం.ఎస్.సుబ్బులక్ష్మి, చిదంబరం సుబ్రహ్మణ్యం, జయప్రకాష్ నారాయణ్, అమర్త్యసేన్, గోపీనాథ్ బోర్డోలోయ్, పండిట్ రవిశంకర్, లతా మంగేష్కర్, బిస్మిల్లా ఖాన్, భీంసేన్ జోషి, సిఎన్ఆర్ రావు, సచిన్ టెండూల్కర్, మదన్‌మోహన్ మాలవ్య, ప్రణబ్‌ముఖర్జీ, నానాజీ దేశ్‌ముఖ్, భూపేన్ హజారికా ఉన్నారు.


నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు 1992లో ఈ పురస్కారం ప్రకటించినప్పుడు అది ఎంతో వివాదాస్పదమైంది. తర్వాత దానిని ఉపసంహరించుకున్నారు. అలాగే ఎన్టీఆర్ వంటి మరికొందరు నేతలకు ఇవ్వాలనే డిమాండ్ కూడా చాలా కాలం నుంచి ఉంది. ఏది ఏమైనా 'భారతరత్న'లే కాదు, సమాజాన్ని ఏదో ఒక కోణంలోంచి ప్రభావితం చేసిన వారందరు కూడా 'రత్నా'లే కదా! ❑



కామరాజ్


లాల్‌బహదూర్‌శాస్త్రి


ఎంజి రామచంద్రన్


సచిన్


సత్యజిత్‌రే


రాజేంద్రప్రసాద్

# చీమల చట్నీ

**రోజుకో** కొత్తవంట మన ముందు వచ్చివాలిపోతున్నది. ఇప్పటికే కొన్ని వేల వంటలు యూట్యూబ్‌లో వచ్చి చేరాయి. కొన్నిరకాల వంటకాలు మనకెంతో ఆశ్చర్యమనిపిస్తుంది, కానీ ఆ వంటలు ఆయా ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉంటాయి. ఇలాంటి వంట ఒకటి చీమల్ని రుచికరమైన చట్నీగా చేసి తింటారు. ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో 'సిమిలిపల్ కాయి చట్నీ' గురించి గొప్ప చెప్పుకుంటారు. అక్కడి అడవుల్లో ఈ చీమల పెంపకం భారీస్థాయిలో జరుగుతోంది. ఎర్రచీమలు, మసాలాలు కలిపి చేసే ఒకరకమైన చట్నీ ఇది. భువనేశ్వర్‌లోని ఒడిశా యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు ఎర్ర నేత చీమల్లో ప్రొటీన్లు, కాల్షియం, విటమిన్ బి-12, ఐరన్, మెగ్నీషియమ్, జింక్, పొటాషియం, సోడియం, కాపర్



ఉన్నాయని గుర్తించారు. అయితే ఈ విషయం అక్కడ నివసిస్తున్న కొన్ని తెగల వారికీ ఎప్పుడో తెలుసు. అందుకే వాళ్లు ఎర్రనేత చీమల చట్నీని అనాదిగా తమ ఆహారంలో భాగం చేసుకున్నారు. శాకాహారం, మాంసాహారాలలో ఎన్నో వెరైటీలు ఉండగా చీమల్ని ప్రత్యేకంగా ఆరగించడం ఎందుకు? ఈ సందేహం సాధారణ ప్రజానీకానికి తప్పకుండా వస్తుంది. కానీ అడవుల్లో జీవనం సాగిస్తోన్న కొన్ని తెగల వారికి ఈ సూత్రం వర్తించదు. వారి ఆహార అలవాట్లకు ఎన్నో పరిమితులు ఉంటాయి. అందుకే ఆదిమ తెగల వారికి చీమలే చక్కని పౌష్టికాహారం. ఒడిశాలోని మమూర్‌భంజ్ అడవుల్లో కనిపిస్తాయి ఎర్రనేత చీమలు. వీటిని స్థానికంగా 'కాయి పింపుడి' అని పిలుస్తారు. ఈ చట్నీని కాయ్‌గా పిలుస్తారు. 2018లో ఇక్కడికి వచ్చి ఈ చట్నీని ఆరగించిన బ్రిటీష్ చెఫ్ గోర్డాన్ రామ్‌కే తన మెనూలో ఈ చట్నీని చేర్చుకున్నాడు. 'డిలీషియస్' అని కితాబిచ్చాడు. అలా అంతర్జాతీయంగానే కాకుండా జాతీయంగా పెరుగుతోన్న ప్రజాదారణ వల్ల తమ చట్నీకి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్ కావాలని మయూర్‌భంజ్ ఆదిమ తెగవాళ్లు 2020లో ప్రభుత్వం ముందు ఓ ప్రతిపాదన పెట్టారు. నాలుగేళ్ల తర్వాత నూతన సంవత్సర కానుకగా ఈ ఏడాది 'జీఐ' ట్యాగ్ లభించింది. దీంతో మరోసారి వార్తల్లో నిలిచింది కాయ్ చట్నీ. ఒడిశాతో పాటు ఉత్తర, ఈశాన్య భారతంలోని కొన్ని తెగల వాళ్లు కూడా ఈ చట్నీ ఆరగించడం సర్వసాధారణం. వైద్యపరంగా కూడా ఈ చట్నీ ప్రయోజనాల గురించి ఇక్కడి ఆదిమ తెగల వారికి బాగా ఎరుక ఉంది. దగ్గు, జలుబు, తలనొప్పి, కీళ్లనొప్పుల నుంచి ఉపశమనానికి మందులా ఈ చట్నీని వాళ్లు వినియోగిస్తారు. ఎర్ర నేత చీమల లార్వా కూడా చాలా రుచిగా ఉంటుందని అంటారు 'బాతుడీ' తెగకు చెందిన ఓ వ్యక్తి. ఈయన మయూర్‌భంజ్ 'కాయి' సొసైటీ సభ్యుడు. పచ్చిమిర్చి, ఉప్పు, చీమలు కలిపి బండమీద రుబ్బి పచ్చిగానే ఆరగిస్తారట. అంతేకాదు టమాటా, కొత్తిమీర, అల్లం, వెల్లుల్లి, ఉప్పు చిటికెడు చక్కెర కలిపి 'యుమామిపేస్టు'ను వీరు తయారు చేస్తారు. దీన్ని అన్నంతో పాటు కూరలా తింటారు. బ్రెడ్‌పై జామ్‌లా కూడా రాసుకుంటారు. కొన్ని తెగల వాళ్ల ఎర్రనేత చీమలతో రుచికరమైన సూప్ చేస్తారు. మరి కొంతమంది ఈ చీమలను నూనె, ఉప్పులో వేసి పెట్టి స్నాక్‌లా ఆరగిస్తారు. 'చీమలు.ఓ ఆహారం'గా విస్తృత అధ్యయనాలు చేశారు మధులికా దాష్. ఒడిశాకు చెందిన 'ఫుడ్ ఆంత్రోపాలజిస్టు' ఆమె 'కీటకాలకు సంబంధించిన చట్నీలను ఎన్నో ఆరగించాను.. అయితే చీమలు వంటకాలన్నీ శీతాకాల రుచులే. మిగతా కాలాల్లో చీమలను పెంచడం, పట్టుకోవడం కష్టం. ఒడిశా పక్కనే ఉన్న జార్ఖండ్. చత్తీష్‌గఢ్ రాష్ట్రాలలో కూడా 'కాయ్‌చట్నీ' ప్రసిద్ధి చెందింది. చత్తీస్‌గఢ్‌లో దీన్ని 'ఛాప్రా' అంటే 'ఆకుబుట్ట'గా పిలుస్తారు. ఈ చీమలన్నీ ఆకులను ఉపయోగించి గూళ్లను తయారు చేస్తాయి కాబట్టి ఆ పేరు వచ్చింది. ఇటీవల కాలంలో ఒడిశాలోని హోటళ్ల మెనూలో 'కాయ్ చట్నీ'ని చేర్చారు. అక్కడికి వెళ్లే టూరిస్టులు ఈ ప్రత్యేక చట్నీని ఆస్వాదిస్తున్నారు. అలాగే హోటల్ నిర్వాహకులు 'కలినరీ టూర్స్'లో భాగంగా ఎర్రనేత చీమలు పెరిగే ప్రాంతా లు, చట్నీ చేసే ప్రదేశాలు, అమ్మే మార్కెట్లకు పర్యాటకులను తీసుకువెళుతూ చీమల చట్నీకి అవసరమైన ప్రచారాన్ని కల్పిస్తున్నారు.

**ఇతర దేశాల్లో కూడా తింటారు:** మనం పల్లీలను తిన్నట్టుగా కొలంబియాలో ఎర్రచీమల్ని తింటారు. ఉప్పూకారం కలిపి నూనెలో లేదా విడిగా వేయించి ఆరగించడం అక్కడ మామూలే. అయితే చీమల రెక్కలు, తన, కాళ్లు తీసిన తర్వాతే తింటారు. రాణీచీమల వేపుళ్లు బ్రెజిల్‌లో ఫేమస్. ఉప్పు నీళ్లలో నానబెట్టి ఆ తరువాత ఉప్పూకారం, మసాలాలతో వేయించి ఆరగిస్తారు.

**ఆస్ట్రేలియా:** వంటల మీద గుబాళింపుగా కొత్తిమీర తరుగును వేసినట్టుగా ఆస్ట్రేలియాలో కొన్ని ప్రాంతాల్ల ఆకుపచ్చని చీమల్ని వాడతారు. తేనెలో నానబెట్టిన చీమల్ని ఆరగించడం అక్కడి సంప్రదాయం. చీల గుడ్లని క్యాన్లల్లో వేసి అమ్మే దేశా థాయ్ లాండ్. వీటిని 'ఖాయమాట్ దాంగ్' అంటారు. ఎర్రచీమల గూళ్ల లో దొరికిన గుడ్లని శుభ్రపరచి తాజా కూరగాయలు, మసాలాతో వేయిస్తే వీటి రుచి అద్భుతమని అంటారు థాయ్‌వాసులు.

## ఈవారం కవిత్వం



# తీర్పు

విజ్ఞానం పెరిగేకొద్దీ/ అశాంతి కూడా పెరుగుతుంది
సైంటిస్టుకూ కవికీ/ పెద్ద భేదముండదు
ఇద్దరూ కలలే కంటారు.
కొత్త ఆవిష్కారం జరిగినప్పుడల్లా/
పాతకు అసహనం పెరుగుతుంది.
పారిశ్రామిక విప్లవం వచ్చినప్పుడు
ఇంగ్లాండంతా విలవిల లాడింది/
పాపం!
వర్డ్స్ వర్త్
చెట్లూ పుట్టలు పట్టుకుని తిరిగాడు.
హైదరాబాద్ ఒకప్పుడు
నూరు గ్రామాల సమాహారం
ఇప్పుడు సిమెంటు జంగిల్‌లో
దాన్ని వెతుక్కుంటున్నాను.
మెట్రో రైలు వల్ల
ఆకాశం ముక్కలయ్యింది
గమ్యం మళ్లీ భూమే
ఇప్పుడది
అపరిమితం అగమ్యం.
మరి అభివృద్ధి వద్దా!
అనేది నీ ప్రశ్న
దాని పదఘట్టనల కింద
చరిత్ర చూరుచూరౌతున్నప్పుడే బాధ.
అప్పటి చాయ్‌వాలా కోసం
దిక్కులు చూస్తున్నాను/ గుడ్డ పరచుకొని
రేగుపండ్లమ్ముకునే బాగమ్మ
ఎటు అదృశ్యమైందో తెలియదు./
మార్పు.. / నిజానికి ఒక నిట్టూర్పు
కాని అది/ కదిలే కాలం చెప్పే/ కల్లోల తీర్పు.

**- డా॥ ఎన్.గోపి**

---

# ఒక బాణం-ఒక గానం

గాల్లోకి నేనొక బాణం
సంధించాను
అది భూమి మీద పడింది,
కానీ ఎక్కడో తెలియదు
అది ఎంత వేగంగా దూసుకుపోయిందంటే
నా చూపు దాన్ని అందుకోలేకపోయింది.
నేను గొంతెత్తి గాల్లో ఒక పాట పాడాను
అది కూడా భూమి మీదే పడింది కాని, ఎక్కడో తెలియదు
అయినా గానాన్ని అనుసరించగల
సున్నితమైన చూపు
ఎవరికుంటుందనీ?
చాలా కాలం గడిచిపోయ్యాక మళ్లీ
అటు వెళ్లాను
చెట్ల గుబురులో బాణం ఉంది విరగకుండా!
అలాగే నా పాట వినిపించింది పొల్లుపోకుండా
మొదటి నుండీ చివరిదాకా స్నేహితుడి మదిలో.

**- మూలం: హెచ్.డబ్ల్యూ.లాంగ్‌ఫెలో**
**తెలుగు: డాక్టర్ దేవరాజు మహారాజు**

---

# మాతృభాషకే అగ్రాసనం

రాగరంజితమై తేజరిల్లు భాష,
సుస్వర శోభితమై ప్రభోదించే
మధురాతి మధుర భాష,
అమ్మ గర్భగుడిలో
ఉగ్గుపాలతో ఇమిడిన
తొలి బీజాక్షరపు భాష,
అమ్మ భాష.

నిపుణత పెంచుటలో నెలవైన
మాతృభాషకు
కాదేదీ ఇలలో పోటీ,
సకల భాషలలో అదే మేటి,
అది విశ్వభాషలను
తలదన్నే ఘనకిరీటి.

అమరలోక సోయగం,
ఆమని కలకూజితం
కలగలిపి
అలరించే
మాతృభాష
హృదిలోని భావాలకు
వాగ్ అక్షర రూపాలనిచ్చి
జ్ఞాన, విజ్ఞాన వీచికలు
వీయించే
కమ్మనైన భాష.

మాతృభాషకెంతో గర్వకారణం
తాను అయితే
మృత్యుంజయం.
అందుకే మాతృభాషను
మహోన్నతంగా చూద్దాం,
మన వంతు ఉద్యమిద్దాం.

**- వేమూరి శ్రీనివాస్**



# పుస్తక సమీక్ష

## నవనవలాడే వ్యాసాలు!




వ్యాసం విషయ పరిజ్ఞానాన్ని పెంచి, మనోవి కాసానికి దోహదపడుతుంది. ఇది వంశీ ఆర్ట్ థియే టర్ హైదరాబాద్ వారి ప్రచురణ. గత 50ఏళ్లగా వంశీసంస్థ ఎన్నో ప్రయోజనకరమైన పనులను చేబడుతోంది. స్వర్ణో త్సవాల సందర్భంగా 25 పుస్తకాలు ప్రచురించింది. ప్రస్తుత వ్యాస సంకలనం ఇందులో ఒకటి. 102 మంది ప్రముఖ, అభ్యు దయ వర్ధమాన వ్యాసకర్తలు తమ ఆలోచనలని ఈ సంకలనంలో మనతో పంచుకున్నారు. వాసిలోను ఈ వ్యాసాలు బావున్నాయి. 5విభాగాలు గా వ్యాసాలన్నింటినీ విభజించారు అవి. 1. భారత దేశభ్యున్నతి, 2. ప్రేమ-పరిణయం, 3. భారతీయ కళ, 4. మానవ పురోగ మనం, 5 దేశ ర్థిక వ్యవస్థ సుమారు, మూడు పేజీలకు కాస్త అటూ, ఇటుగా ఉన్నాయి. 'చర్విత చర్వణమ్' అన్నట్లు కాకుండా, సంకలనకర్తలు డా॥తెన్నేటి సుధాదేవి, భావరాజు పద్మిని శ్రద్ధవల్ల వ్యాఆలన్నింటా వైవిధ్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. దేవులపల్లి కృష్ణశాస్త్రి మనుమరాలు లలితారామ్ అమెరికా, ప్రతిపా దింపబడి నట్లు, వంశీ సంస్థ ఈ సంకలనం ముద్రించినట్లు విశదమౌతున్నది. దేశమంటే మనమేనోయి, ప్రేమే జీవితమా! ప్రేమించు, వ్యవసాయం కూడా ఓ విలువైన కళే! మా'నవ' పురోగ మనం ఉల్లిఘాటులాంటి వ్యాసమ కుటాలు పాఠకుడిని ఆకట్టు కుంటాయి.

**(నవవ్యాసమాలిక, వ్యాసకదంబం, సంకలనం: తెన్నేటి సుధాదేవి, పద్మిని భావరాజు, వెల: ర500, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు)**

**– కూర చిదంబరం**


## నిర్ణయాత్మక కథలు 'నిరుడు కురిసిన వెన్నెల'



రచయిత ఈ కథల సంపుటిని తన ఆత్మీయ మిత్రుడు జి.శ్రీధర్‌కు అంకితం అభిమానంతో చేసారు. 15 కథల సమాహారం ఈ కథాసంపుటి. అరంధతి-ఉమ్మెత్తపూలు, ప్రతీకారం ప్రాయశ్చితం గులాబీ అంచనాలాంటి కథలు పాఠకుల్ని కదిలిస్తాయి. అనేక అనుభవాలు ఈ రచయిత చేసారు. కేంద్రసాహితీ అకాడమీ చేత అనువాద పురస్కారం పొందారు. కథలు అనేవి మాన జీవితంలోంచి, కొన్ని కథలు స్వీయానుభవంలోంచి పుడతాయి. కొన్ని వాస్తవాలుపడ్డ ఆవేదనలు, వివిధ ఘట్టాలు అద్భుత కథనంతో మంచి కథలౌ తాయి. అన్ని కథలు గురించి చెబితే విషయసూచిక అవుతుంది. మచ్చుకు, 1,2 కథలు చూద్దాం. సంస్కారవంతమైన స్త్రీ అభ్యు దయాన్ని కోరే కథలున్నాయి. వర్షంలో తలదాచుకునేందుకు 'కమల' ఇంట్లోంకి ప్రవేశిస్తుంది ఓ పూలు తెచ్చిన పిల్ల, ఆ పిల్ల దేవుడికి ప్రతిదినం పూలుకోసి మాలకట్టి అయ్యోలికి ఇస్తుంది. ఆరోజు పూలు దొరకకపోవడంతో 'ఉమ్మత్తపూలు' కోసుకొని గుడికి బయలుదేరడం వర్షంలో 'కమల' ఇంట్లోకి వెళ్లడం, ఆమె చీకట్లో వుండటం దీపం వెలిగించడం ఉమ్మెత్త పూలు పనికిరావని 'కమ ల' ఆ పిల్లకు చెప్పడం వాటిని కమలకు ధరింపజేయడం, సమా జంలోని స్త్రీ అందునా వితంతువు జీవితాన్ని రెండు పాత్రలతో కథను నడిపిస్తూ సమాజంలోని ద్వంద్వ నీతిని పూలపిల్ల ద్వారా చెప్పించడం బాగుంది. **(నిరుడు కురిసిన వెన్నెల, రచన: జిల్లెళ్ళ బాలాజీ, వెల: రూ 110, ప్రతులు: ఇ.నం. 9-535, ఓంశక్తి గుడి పక్క సందులో, లింగేశ్వరనగర్, బైరాగిపట్టెడ, తిరుపతి)** **– తంగిరాల చక్రవర్తి**

## మంచిమాటల శతకం 'మణిదీపికలు'

ప్రముఖ పద్య కవయిత్రి నందూరి సుందరీ నాగమణి 108 పద్యాలను 'ఆటవెలది' ఛందస్సుతో సంధించి 'మణిదీపికలు' పేరిట ఓ చిరుశతక గ్రంథాన్ని వెలువరించారు. దీన్ని సామాజిక పద్యశతకంగా ప్రకటించారు. ప్రకటించినట్టుగానే నేటి సమాజంలోని రుగ్మతలను, మనిషిలోని బలహీనతలను ఎత్తిచూపుతూ, మన ప్రవర్తన, నేర్చుకోవలసిన విషయాలను కవితా



వస్తువులుగా ఎన్నుకొని పద్యరచన కొనసాగింది. 'మణి పలుకుఉ మహిని మానితములు' అన్నది మకుటం. 'ప్రేమ పంచవలయు, ప్రీతితోడ జనులు,/ పొందవలెను, పొలుపు చిందగాను,/ హృదయమందు ఈసునసూ యలు?' యిదీ మొదటి పద్యం. జనులందరూ ప్రేమను పంచవ లెను, పొందవలెను. అప్పుడే మనశ్శాంతి. హృదయమునందు ఈర్ష్యానుసూయలు కలిగియుండుట ఏల? అని ప్రశ్నిస్తున్నారు నాగమణి. చివరగా..'ధనమురాదు వెంట, తనయులసలురారు/ వలువలైనరావు వెలరునపుడు/ స్వచ్ఛమైన యాత్ర స్వామి సన్నిధి చేరు' అనే పద్యంతో ముక్తాయిస్తారు. తాత్వికతను మేళవించిన జీవిత సత్యం యిది. సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా రాయడం తో కవయిత్రి ప్రతిభ ద్యోతకమవుతుంది. వ్యక్తిత్వ నిర్మాణానికి ఉపయుక్తమైన 'మణిదీపికలు' పఠించడం ఓ చక్కటి అనుభవం.

**(మణి దీపికలు, రచన: నందూరి సుందరీ నాగమణి, వెల: రూ 120, ప్రతులకు: ఫ్లాట్7/ బి18, హెచ్ఐజి 11, మానస ఎన్‌క్లేవ్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్) – రమణ వెలమకన్ని**

దూరదర్శన్ సంస్కృతి సంప్రదాయాలకు, మానవీయ విలువలకు ఒక తరం నుండి మరో తరానికి అందించే వారధిగా మహత్తర బాధ్యతను నిర్వర్తించిన డా॥పాలకుర్తి మధుసూదనరావు 'నేను-నా ఆకాశదర్శన్' పేరిట తన అనుభవాల

## 'నేను-నా ఆకాశదర్శన్' డా॥పాలకుర్తి



అక్షరమాలికను చదువరులకు అందించడం అభినందనీయం. ఆకాశవాణి, దూరదర్శన్‌లు ఎందరో ప్రతిభావంతులైన సాహితీవేత్తలు, కళాకారులు, సమరయోధులు మేధా సంపన్నతకు దీప్తివంతమైన నిలయాలుగా తీర్చిదిద్దే ఉద్యోగ బాధ్యతలు, డా॥పాలకుర్తి వ్యక్తిత్వ పరిపూర్ణత సాధించే రచయితగా ఈ గ్రంథంలో వివరించారు. ఆకాశవాణి, దూరదర్శన్ సంస్థలతో డా॥పాలకుర్తికి కొనసాగిన అనుబంధం కేవలం ఉద్యోగ బాధ్యతల సక్రమ నిర్వహణే కాకుండా మరింత తాదాత్మ్యంతో కూడిన ఆత్మీయత, జీవితాదర్శంగా సృజనాత్మక ఉన్నత విలువలకు పట్టం కట్టినట్టుగా ఈ అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. డా॥పాలకుర్తి మదిలో మెదిలిన ఆలోచనల కారణంగా ఎందరో లబ్ది ప్రతిష్టులైన మహనీయులు దూరదర్శన్ సప్తగిరి ప్రాంగణంలోకి అడుగుపెట్టడం ఆ సంస్థలకు చిరఃస్మరణీయ పవిత్రత లభించింది.

**(నేను-నా ఆకాశ దర్శన్, రచన: డా॥పాలకుర్తి మధుసూదనరావు, వెల: రూ 200, ప్రతులకు: ఇ.నం.11-13-1329, రోడ్ నం. 4బి, ఇందిరా నిలయం, మార్గదర్శి కాలనీ, హైదరాబాద్)**

**– యర్రమిల్లి**



# పిల్లల పెంపకం

**సాధారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదివి ప్రయోజకులు కావాలని కోరుకుంటారు. పిల్లలు బాగా చదవాలంటే పిల్లల ముందు భార్యాభర్తలు ఎప్పుడూ తగువులాడుకోకూడదు.**

పక్కింటి, బంధువుల పిల్లలు చదివేస్తున్నారని పిల్లల్ని నిందించడం ముందుగా మానుకోవాలి. భార్యాభర్తల మధ్య మనస్పర్థలకు, ఘర్షణకు చిన్న సమస్యలే కారణమవుతాయి. ఎదుటివ్యక్తి ఏం చేసిన తప్పుగా కనిపించడం, పాత మనస్పర్థలకు అవి జతకలవడం జరుగుతుంది. అలాంటి సమయంలో చేసిన తప్పులే గుర్తుకు వస్తాయి. వారు చేసిన మంచి, చూపించిన ఆప్యాయత, ప్రేమలు గుర్తుకురావు. అందుకే ఇద్దరి మధ్యా ఎటువంటి పొరపొచ్చాలూ రాకుండా ఉండాలంటే మిగిలిన విషయాల్లో కూడా సమతుల్యత పాటించాలి. పిల్లల్ని కంట్రోల్ చేయలేకపోతున్నామనేది తల్లిదండ్రుల ఫిర్యాదు. నిజమే వాళ్ల సందేహాలు, సమస్యలూ, అవసరాలూ, అల్లర్లూ, ముద్దుముచ్చట్లు ఒకటా రెండా, తీర్చేకొద్దీ ఇంకా పుట్టుకొస్తుంటాయి. ఆట వస్తువులతో ఆడుకునే వయసు దాటిన, తర్వాత పిల్లలకు తమ చుట్టు వున్న ఇతర వస్తువుల మీదకి దృష్టిపోతుంటుంది. పెద్దవాళ్లు వద్దన్నకొద్దీ ఆ వస్తువులను ఆపరేట్ చేయాలన్న ఆసక్తి పెరుగుతుంటుంది. ఇంట్లో వుంటే టీవీ, డివిడి ప్లేయర్లు, వాల్‌క్లాక్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఇంకా ఇతర ఖరీదైన వాటిమీదకి పిల్లల దృష్టి మరలుతుంటుంది. పెద్దవాళ్లకి తెలియకుండా ఆ వస్తువుల్ని ఇంకా ఇతర ఖరీదైన వాటిమీదకి పిల్లల దృష్టి మరలుతుంటుంది. పెద్దవాళ్లకి తెలియకుండా ఆ వస్తువుల్ని కదలించి అటూఇటూ తిప్పి ఆపరేట్ చేసి ఆనందించాలను కుంటారు. ఈ పరిస్థితుల్లో పిల్లలమీద కోప్పడి ప్రయోజనం లేదు. అలా చేస్తే పేరెంట్స్ ఇంట్లో లేనప్పుడు పిల్లలు ఆ పనే చేస్తారు. కాబట్టి వారి ఆసక్తిని గమనించి పనికిరాని, పాడైపోయి, పక్కన పడేసిన కొన్ని వస్తువుల్ని వారి ముందు ఉంచి ఆ భాగాలను సరిగా అమర్చే పనిని పిల్లలకు అప్పగించండి. టీవీ ఆన్ ఆఫ్ చేయడం, వాల్‌క్లాక్‌లో బ్యాటరీలు మార్చడం లాంటి పనులు కూడా వారికే అప్పగించండి. ఆసక్తి వుంది కదా అని గ్యాస్‌స్టౌ, ఐరన్ బాక్స్, వాషింగ్ మెషీన్‌లాంటివి ఆపరేట్ చేయనివ్వకండి. అలా చేయడం వల్ల పిల్లలకు ప్రమాదాలు జరగొచ్చు. పిల్లల్ని స్కూల్లో చేర్పించి, బుక్స్ కొనిచ్చి, ఫీజలు కట్టేయడంతో పేరెంట్స్ పని

**తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి**

అయిపోయినట్లు కాదు. పిల్లలు ఎలా చదువుతున్నారో కూడా తెలుసుకుంటూ వుండాలి. రోజూ ఓ గంటసేపైనా పిల్లల్ని దగ్గర కూర్చోపెట్టుకుని చదివించడం అవసరం. చిన్నారుల చదువును తల్లి, తండ్రి, ఇంట్లో పెద్దలు ఎప్పుడూ పర్యవేక్షిస్తుండాలి.

కొంతమంది పిల్లలు సరిగ్గా చదవరు. తల్లిదండ్రుల మీద భయంతో ఎప్పుడూ బుక్స్ ముందు పెట్టుకుని చదువుతున్నట్టు నటిస్తుంటారు. పేరెంట్స్ మోసపోయి, మార్కులు సరిగ్గా ఇవ్వకుండా పిల్లల్ని ఫెయిల్ చేస్తున్నారని టీచర్లతో గొడవపడుతుంటారు.

స్కూల్లో భయంవల్ల సరిగ్గా చదవలేకపోయిన చిన్నపిల్లలు ఇంట్లో పేరెంట్స్ ఆప్యాయం గా కూర్చోబెట్టుకుని చదివిస్తే బాగా చదువుతారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే పేరెంట్స్ దగ్గర కూర్చోబెట్టుకుని చదవించాలి.

ఒక వయస్సు వచ్చేసరికి ఏ ఆకతాయిలతోనే స్నేహం పెంచుకునే ప్రమాదం ఉంది.

పిల్లలకు ఆటలు, పాటలు, చిత్రలేఖనం, వాయిద్యకళలు లాంటివి ఏదో ఒక లలిత కళల్లో ప్రవేశం కల్పించండి. దీనివల్ల అదే కళతో పరిచయం వున్న కొందరు వారికి మిత్రులు కావచ్చు. స్నేహితుల విషయంలో పిల్లలకు కొంతవరకైనా స్వేచ్ఛ ఇవ్వండి.

లేకుంటే వాళ్లకి అసలు స్నేహితులే లేకుండా

పోయే ప్రమాదం ఉంది. కొంతమంది పిల్లలు ఇంట్లో చిచ్చర పిడుగుల్లాగా ఉంటూ స్కూల్లో డల్‌గా, ముద్దుల్లాగా ఉంటారు. ఇంకొంతమంది పిల్లలు ఇంట్లో బుద్ధిమంతుల్లాగా ఉంటూ, స్కూల్లో అల్లరి పిల్లలుగా పేరుతెచ్చుకుంటారు. పిల్లలు ప్రవర్తనలో ఇలాంటి తేడా ఉంటే గమనించి సరిదిద్దడానికి ప్రయత్నించండి.

పిల్లలు మంచివాళ్లు బుద్ధిమంతులూ అయినా, వాళ్ల ఫ్రెండ్స్ చెడ్డవాళ్లు అయితే ఇబ్బంది. పిల్లలు ఎలాంటి వాళ్లతో స్నేహం చేస్తున్నారో అనే అనుమానం వుంటే పిల్లల ఫ్రెండ్స్‌ను ఎంపిక చేయండి. బంధువులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్ తెలిసిన కుటుంబాల్లోని పిల్లలతో ఫ్రెండ్‌షిప్ చేసుకునేలా చూడండి. దీనివల్ల పిల్లల ఫ్రెండ్స్ గురించి తెలుస్తూ ఉంటుంది.

కొంతమంది పిల్లలు ఎప్పుడూ ఉత్సాహంగా గంతులు వేస్తుంటే, కొందరేమో నీరసంగా, నిరుత్సాహంగా డల్‌గా ఉంటారు. దీనికి కారణం కొంతవరకూ పెద్దల పెంపకంలో తేడా కావచ్చు. పిల్లల్ని ఒక వయసు వరకూ ప్రేమగా దగ్గరకు తీసుకుని స్పృశిస్తూ ఉంటే పిల్లలకి ఆప్యాయత, రక్షణ, భద్రత ఉండే ఫీలింగ్స్ కలుగుతాయి. దీనివల్ల వారిలో ఎప్పటికప్పుడు కొత్త ఉత్సాహం చోటు చేసుకుంటుంది. పిల్లల్ని ఎప్పుడూ ఒకేరకం వస్తువులమధ్య, ఒకే పరిసరాల్లో, ఒకే వాతావరణంలో వుంచితే నిరుత్సాహం ఏర్పడుతుంది. కొత్తకొత్త వస్తువులను పిల్లలకి చూపుతూ, వాటిమధ్య గడిపేలా చేయండి.



అప్పుడప్పుడు బయట ఎగ్జిబిషన్లు, పార్కులు, మ్యూజియమ్స్, పిక్నిక్‌లాంటి వాటికి తీసుకెళుతుంటే వారిలో ఉత్సాహం మొదలవుతుంది. వాదనల వల్ల దూరాలు పెరుగుతాయే తప్ప తరగవు. అందుకే ఒక సమస్య ఎదురైనప్పుడు దాన్ని అక్కడ వరకే, ఆ సమస్య వరకే పరిమితం చేయాలి. కలిసి కూర్చుని మాట్లాడుకోవాలి. గతాన్ని తీసుకురాకూడదు. ఎంత పని ఒత్తిడి ఉన్నా సరే ప్రతిరోజు తమకంటూ కాస్త సమయాన్ని కేటాయించుకుని, సరదాగా మాట్లాడుకోవాలి. విమర్శించే ధోరణికన్నా సమస్యను గుర్తించి పరిష్కరించుకునేలా ఆలోచిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కుటుంబం అంటే నానమ్మ, తాతయ్య, నాన్న, అమ్మ, బాబాయి, పిన్ని, పెద్దనాన్న, పెద్దమ్మ అన్నయ్య వదిన, అక్క, చెల్లెళ్లతో సందడి సందడి. నా అన్న వాళ్ల





ఉన్నారనే భరోసా ఒక్క ఉమ్మడి కుటుంబంలోనే దొరుకుతుంది. పిల్లలు కన్న తల్లిదండ్రుల కంటే తాతయ్య, బామ్మలతో కలిసి ఉండటం వల్ల మనో వికాసాన్ని పొందగలుగుతారు. తల్లిదండ్రులకు పిల్లలతో గడిపే సమయం లేక వారికి మంచీ, చెడులు చెప్పలేని పరిస్థితి, నలుగురితో కలిసి ఉంటే మంచిచెడు మధ్య వ్యత్యాసం, తప్పు, ఒప్పులంటే ఏమిటో తెలుసుకోగలుగుతారు. పిల్లల్లో తప్పు చేసే అవకాశాల తక్కువగా ఉంటాయి. పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఎంత బాధ్యతగా వ్యవహరించినా, వారు ఒక్కరే అన్ని విషయాలు చెప్తే సరిగా వినలేరు. బామ్మ, తాతయ్యలు నెమ్మదిగా వాళ్ల అనుభవాన్ని అంతా జోడించి ప్రేమతో ఇలా చేయకూడదు అనే విషయాన్ని చెప్తే పిల్లలు తొందరగా ఆకళింపు చేసుకుంటారు. కుటుంబం అంటేనే అందరూ కలిసి ఉండడం, నేటితరంలో విడిపోయేందుకు చూపించేంత మక్కువ కలిసుండానికి చూపించట్లేదు అందుకు కారణాలేవైనా కావొచ్చు. కలిసుంటే ఉండే ఆనందం, సంతోషం ముందు భవిష్యత్తులో ఏది దొరకదు. భవిష్యత్తులో ఉందామన్న ఉండలేని పరిస్థితి ఉమ్మడిగా కలిసుంటే ఎన్నో ఆనందాలు సమస్యలను ఎదుర్కొనే మానసిక ధైర్యం సొంతమవుతాయి. రానురాను ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై, చిన్న కుటుంబం అనే భావన ఏర్పడింది. ప్రస్తుత పరిస్థితుల్లో భార్యభర్తలు ఇరువురు బిజీగా ఉండటం, పిల్లల్లో విలువలు, మానసిక ధైర్యం అందించేవారు కరువయ్యారు. ఉరుకుల పరుగుల జీవితంలో ఒంటరి బతుకు సాగించే చిన్న కుటుంబాల వ్యవస్థలో సర్దిచెప్పేవారు కరువయ్యారు. ఒంటరి జీవితానికి అలవాటు కావడం, కుంగుబాటు, చిన్నచిన్న సమస్యలను పరిష్కరించు కోలేకపోవడం వంటి మానసిక అవలక్షణాలకు చేరువవుతు న్నారు. ఎక్కడైనా బంధుత్వాలు కనిపిస్తున్నాయంటే అవి ఆర్థికపరమైనవే తాత్కాలికమైనవి. ప్రస్తుత పరిస్థితులను చూస్తే మానవత్వం మంటకలుస్తోంది. సామాజిక స్పృహ కరువయ్యింది. ఉన్మాదం పెరిగిపోతోంది. మనకు అవసరం లేని సైట్స్ బ్లాక్ చేయడానికి మార్కెట్‌లో కొన్ని సాఫ్ట్‌వేర్లు అందుబాటులో ఉన్నాయి. ఇలా తల్లిదండ్రులు అందించే నైతిక మద్దతు వారిని విజయతీరాలకు చేర్చుతుంది. అదే విషయాలను ఒంటపట్టించుకునే నైపుణ్యాన్ని ఇస్తుంది. వీరికి చక్కగా వినే సామర్థ్యం ఉంటుంది. దానికి తగినట్లుగా భావవ్యక్తీకరణ వీరికి తోడైతే అద్భుతాలు సాధిస్తారు.

కథ

# మంచి మార్పు

**షాదుల్** పదవ తరగతి చదువుతున్న విద్యార్థి. చదువు మీద శ్రద్ధ చూపేవాడు కాదు. వారానికి ఒకసారి మాత్రమే బడికి వెళ్లేవాడు. సరిగ్గా హోంవర్క్ పూర్తి చేసేవాడు కాదు. బడికి వచ్చినా ఆలస్యంగా వచ్చేవాడు. ఇది గమనించిన ప్రధానోపాధ్యాయులు షాదుల్‌కు ఏవిధంగానైనా గుణపాఠం చెప్పాలని




నిర్ణయించుకున్నాడు. ఒకరోజు షాదుల్ పాఠశాలకు ఆలస్యంగా వచ్చాడు. ప్రధానోపాధ్యాయులు తన దగ్గరికి షాదుల్‌ను పిలిపించుకున్నాడు. 'మన పాఠశాల ఆవరణలో ఉన్న రకరకాలైన మొక్కలను అందంగా కత్తిరించమని, అంతేకాకుండా చెట్లకు పాదులను తవ్వమన్నాడు, చెత్త చెదారం తొలగించమని' చెప్పాడు. నేను పిలిచే వరకు నువ్వు రాకూడదు అని గట్టిగా చెప్పాడు. సరేనని షాదుల్ మొక్కలను కత్తిరించడం, పాదులు తవ్వడం, చెత్తాచెదారం ఏరి వేయడం చేస్తూనే ఉన్నాడు. కానీ ప్రధానోపాధ్యాయులు తనని ఇంకా పిలవడం లేదని ఆ పిలుపు కోసం ఎదురు చూస్తున్నాడు. మధ్యాహ్నం రెండుగంటలు అయింది. అయినా కూడా తను ఏదో ఒక పని చేస్తూనే ఉన్నాడు. అతనికి అలసట కలిగింది వెంటనే ప్రధానోపాధ్యాయులు దగ్గరికి వెళ్లాడు.

'సార్ నన్ను క్షమించండి. నేను ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తాను. ఒక్క అవకాశం ఇవ్వండి. నేను పూర్తిగా మారిపోతాను. మంచి మార్కులతో పాస్ అవుతాను' అని ప్రాధేయపడగానే, ప్రధానోపాధ్యాయులు అతనిలో కలిగిన పశ్చాత్తాపానికి సరేనని ఒప్పుకున్నాడు. మరుసటి రోజు నుండి క్రమం తప్పకుండా బడికి వస్తూ, మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్నాడు. అతను చెప్పినట్టే పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాడు. ఉపాధ్యాయులు విద్యార్థులు షాదుల్‌ను అభినందించారు.

**– యాడవరం చంద్రకాంత్‌గౌడ్**

## చుక్కలు కలపండి





వార్త ఆదివారం

## బాలగేయం

### తేనెబొట్టు



చిట్టిపొట్టి పిల్లలారా!
జాతికి నిర్మాతలారా
ప్రగతి
పథమునందుకొనుము
చూచెద నా కన్నులార
వేళ్ల నొప్పి పుడుతుంటే
రాయలేను అనుకుంటే
నేడు ఈ స్థితి చేరవు
చదువు కష్టమనుకుంటే
చేతిరాత గుండ్రంగా
నోటిమాట సరళంగా
ఉంటేనే ఉత్తముడని
బడియంతా పొగుడునుగా
గడగడమని చదివేసి
చకచకమని రాసేసి
ప్రశంసలను పొందాలి
ప్రథముడిగా నిలిచేసి
క్రమశిక్షణ నేర్పుతారు
నైతికతను పెంచుతారు
మంచి
ఉపాధ్యాయులెపుడు
మానవతను పంచుతారు.

**- జి.రాధికారాణి**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- ఎన్.మంజుశ్రీ,** హిందూపురం

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. చెట్టు విలువని ఎలా కడతారు?

**జవాబు: మంజుశ్రీ!** యాభై సంవత్సరాలు ఎదిగిన ఒక చెట్టు రూ.5.3 లక్షల విలువైన ఆక్సిజన్‌ను అందిస్తుంది. రూ.6.4 లక్షల విలువైన భూసారాన్ని పెంచుతుంది. రూ.10.5 లక్షల విలువైన కాలుష్య నివారణ చేస్తుంది. రూ.5.3 లక్షల విలువైన నివాసాన్ని పక్షులకు, జంతువులకు కల్పిస్తుంది. వీటన్నింటికీ తోడుగా ఆహారం, పువ్వులు, ఔషధాలు, కలపను అందిస్తుంది. ఈ దృష్ట్యా ఒక చెట్టు పడిపోయిందంటే ఆ దేశానికి రూ.32 లక్షల నష్టం కలిగినట్టు అవుతుంది. ఉదా: ఒక భారీ స్థాయి చెట్టు. ఆఫ్రికాలో బయో బాయ్ అనే చెట్టు పూర్తిగా పెరిగితే దాని చుట్టుకొలత 180 అడుగులు ఉంటుంది. దీని తొర్రలో 20 మంది సునాయాసంగా నిల్చోవచ్చు.

**- పి.కాశీనాథ్,** గుంటూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. క్యారెట్ తింటే కంటిచూపు పెరుగుతుందా?

**జవాబు: కాశీనాథ్!** ఈ విషయం అర్ధ సత్యం మాత్రమే. క్యారెట్‌లో విటమిన్-ఏ సమృద్ధిగా ఉంటుంది. కంటి ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయల్లో ఇవీ ఒకటి. విటమిన్-సి, ఇ మొదలైన యాంటి ఆక్సిడెంట్ విటమిన్‌లు సమృద్ధిగా ఉండే తాజా కూరగాయలు, ఆకుకూరలు క్యారెట్‌ల కంటే ఎంతో ఎక్కువ మేలు చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్ విటమిన్‌లు శుక్లాల నుంచి, వయసు పెరుగుతున్న కొద్దీ దాపురించే 'మ్యాకులర్ డీ జనరేషన్' తరహా కంటిచూపు సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయి. అయితే క్యారెట్‌లు, ఇతర కూరగాయలు, విటమిన్ సిప్లమెంట్‌లు తీసుకోవడం వలన ప్రాథమిక దృష్టిపరంగా వచ్చే సమస్యలు (దీర్ఘ దృష్టి, హ్రస్వదృష్టి) మాత్రం పూర్తి పరిష్కారం పొందలేవు.







# కుక్కలతో తిప్పలు


**తడకమళ్ళ మురళీధర్**

**పెంపుడు** కుక్కలను 'మీ కుక్క' అని ఇతరులు తెలుగులో సంబోధిస్తే దాని యజమానికి కోపం, బాధ కలగటం సహజం. యజమానినే అవమానించినంతగా బాధతో స్పందిస్తారు. ఇంగ్లీషులో 'మీ పెట్' అని సంబోధిస్తే మాత్రం అదే యజమాని పెద్దగా బాధపడడు. కుక్కకు గ్రామసింహంగా, విశ్వాసం గల జంతువుగా పేరుంది. శునకాలకు రకరకాల పేర్ల పెట్టి కన్న కొడుకు లేదా కన్న కూతురు మాదిరి గారాబంగా సాకటం మనకు తెలుసు. పెంపుడు కుక్కకు పేరు పెట్టాలంటే పిల్లల పేర్లతో దొరికే పుస్తకాల మాదిరి కుక్కల పేర్లతో పుస్తకాలు కూడా మార్కెట్లో దొరుకుతాయేయో! పెంపుడు కుక్క పుట్టిన రోజు నాడు దానికి కొత్తబట్టలు తొడిగి, బంధువులను ఆహ్వానించి, బర్త్డే కేకుకోసం, 'హ్యాపీ బర్త్ డే టూ యూ' అంటూ విషెస్ చెప్పి, పండుగ వాతావరణం కల్పిస్తారు. అది పడుకోవటానికి ఒక మెత్తటి పరుపు అమరుస్తారు. కుటుంబ సభ్యులతో పాటే తమ పక్కన పరుపుమీద పడుకోబెట్టుకునే వారు లేకపోలేదు. శాకాహార, మాంసాహార భోజనాలు, ప్రత్యేక వంటకాలు దానికోసం తయారుచేస్తారు. శీతాకాలంలో వెచ్చగా ఉండేటందుకు స్వెట్టర్ తొడుగుతారు. మంచి సబ్బుతో స్నానం చేయించటం, జబ్బు చేస్తే వెటర్నరీ డాక్టర్తో పరీక్ష చేయించటం, మందులు వేయటం షరామామూలే. దానితో ఆడటం, ఆటలు నేర్పించటం, దానిమూతి మీద కూడా ముద్దులు పెట్టుకోవటం సర్వసాధారణం. అవి చిన్న పిల్లలుగా ఉన్నప్పుడే వేల రూపాయలు ఖర్చు చేసి కొనుక్కోవటం విదితమే. మరణిస్తే కర్మకాండలు కూడా బాగానే జరిపిస్తారు. జాతిని బట్టి కుక్క ఏడు నుండి పదిహేను సంవత్సరాల పాటు జీవిస్తుందట. ఒక్కమాటలో చెప్పాలంటే పెంపుడు కుక్క తన ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిగా నీరాజనాలు అందుకుంటుంది.



భారతీయ చట్టాలు కుక్కలు, పిల్లులలాంటి జంతువులకు హక్కులు, రక్షణ కల్పిస్తున్నాయి. జంతువుల పట్ల క్రూరత్వ నియంత్రణ చట్టం, జంతు సంరక్షణ నియమాలు, వన్యప్రాణుల రక్షణ చట్టం, భారతశిక్షాస్మృతిలోని 428, 429 సెక్షన్లు, భారత రాజ్యాంగంలోని 51- ఎ(జి) నిబంధన ఇటువంటి మూగజీవుల కు మానవుల నుండి క్రూరత్వం, దౌర్జన్యాలు నిషేధిస్తూ రక్షణ కల్పిస్తున్నాయి. వీధి కుక్కలపై దౌర్జన్యం చేయరాదని, చంపరాదని, వీధి, గ్రామం, పట్టణం నుండి తరిమేయరాదని, కేవలం స్టెరిలైజేషన్ లేదా రోగ నిరోధక టీకాలు ఇచ్చి వీధి కుక్కలబర్త్ కంట్రోల్ చేయాలని చట్టాలు, కోర్టుల తీర్పులు చెప్తున్నాయి. ఏదేని జబ్బుతో బాధపడుతున్న వీధి కుక్కను అనివార్య కారణాల చేత చంపవలసి వస్తే, కేవలం చట్టాలు, నియమాలు ఎంపిక చేసిన ప్రక్రియ ద్వారా మాత్రమే సంబంధిత స్థానిక ప్రభుత్వాలు ఆ పని చేయవలసి ఉంటుంది. పెంపుడు కుక్కలను ఎంతో అపురూపంగా చూసుకునే చాలామంది పొరుగు వారిపట్ల, ఇతరుల పట్ల, పరిసరాల పరిశుభ్రత పట్ల సానుకూలంగా వ్యవహరించకపోవటం బాధ కలిగిస్తుంది. పెంపుడు కుక్కలు ఒక్కోసారి తెల్లవార్లు మొరుగుతూ, శబ్దాలు చేస్తూ పొరుగింటి వారికి రాత్రంతా కునుకులేకుండా ఇబ్బంది కలిగిస్తాయి. అపార్ట్మెంట్లలో పెంపుడు కుక్కలను అనుమతిస్తే అదేరకమైన ఇబ్బందులకు దారితీస్తుంది. నివాసితులు ఉపయోగించే లిఫ్ట్ ద్వారా పెంపుడు కుక్కలను అనుమతిస్తే అదోరకమైన ఇబ్బందులకు దారి తీస్తుంది. నివాసితులు ఉపయోగించే లిఫ్ట్ ద్వారా పెంపుడు కుక్కలను యజమాని బాధ్యతా రాహిత్యంగా తీసుకెళ్లే సందర్భంలో అవి ఇతరులను గాయపరిచే అవకాశం లేకపోలేదు. వాటి పక్కనుండి వెళ్లంటే సహజంగానే భయముంటుంది. పిల్లలు, వృద్ధులు కుక్కతోపాటే అదే లిఫ్ట్లో వెళ్లే సాహసం చేయటానికి జడుసుకుం టారు. పెంపుడు కుక్కలు లిఫ్ట్లో మూత్రం విసర్జించిన సందర్భాలు కూడా మనం గమనిస్తుంటాం. అటువంటి సందర్భంలో కుక్క యజమానులు కనీసం లిఫ్ట్ను శుభ్రం చేయరు. తద్వారా అసోసియేషన్ సభ్యులకు, కుక్క యజమానులకు ఘర్షణ జరగటం, గొడవ పోలీస్స్టేషన్ దాకా వెళ్లటం, నువ్వెంత అంటే నువ్వెంత అనే విధంగా బాహాబాహీ జరగటం సహజం.

ఉదయం, సాయంత్రం పెంపుడు కుక్కను మలమూత్ర విసర్జన కొరకు బయటకు తీసుకువెళ్తారు. అది మలమూత్ర విసర్జన చేసేది నడిరోడ్డులోనో, పాదచారుల దారిలోనో, దాన్ని పాదచారులు గమనించకుండా తొక్కే అవకాశం లేకపోలేదు. కొంతమంది తమ డాంబికం కోసం పార్కుల్లో కూడా తిప్పుతుంటారు. అక్కడా అదే పరిస్థితి. అది పచ్చని గడ్డి మీద మలమూత్రం విసర్జిస్తే వాహ్యాలికి వచ్చిన వారు గమనించకుండా దాని మీద కూర్చోవటం, పండుకోవటం జరుగుతుంది. ఇది ఒక ఇబ్బంది అయితే, మలమూత్రాలు పర్యావరణానికి హాని చేస్తాయి. కుక్కల మలమూత్రాలు, నోటి నుండి కార్చే చొంగ ద్వారా వైరస్ సోకే ప్రమాద ముంది. మహిళల ఆత్మగౌరవం, పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛ భారత్‌మిషన్ పెట్టినట్లు, వీధి కుక్కలు, పెంపుడు కుక్కల నుండి వీధులను, పార్కులను కాపాడుకునే నియమాలు ఉండాలి. పెంపుడు కుక్కకు యజమాని చెప్పినట్లు మసలుకునే స్వభావ ముంటుంది కాబట్టి, తమ ఇంట్లోనే ప్రత్యేకంగా మరుగుదొడ్డి కట్టించుకొని దానిలోని మలమూత్రాలు విసర్జించుకునే విధంగా శిక్షణ ఇవ్వాలి. ప్రత్యేక వసతి లేకపోతే తాము ఉపయోగించే మరుగుదొడ్డిని వాడుకోవాలి. పెంపుడు కుక్కలను బయట తిప్పి బాధ్యతారాహిత్యంగా ద్విచక్ర వాహనాల మీద వెళ్లేవారిని, పాదచారులను భయాందోళనలకు గురిచేయటం, మలమూత్రాలతో రోడ్లను, పార్కులను అపరిశుభ్రంగా చేయటం, పర్యావరణానికి హాని చేయటం విజ్ఞు లమని భావించుకునే వారికి తగదు. ప్రజారహదారి, ప్రజాపార్కు నాది కాదులే అనే భావన తొలగిపోవాలి. అదేవిధంగా పెంపుడు కుక్క ఎవరినైనా పొరపాటున గాయపరిస్తే, యజమాని స్వంత డబ్బుతో ఆ వ్యక్తికి చికిత్స చేయించాలి. చికిత్స కాలంలో తోడుగా ఉండాలి. అటువంటి సామాజిక స్పృహరావాలి. వీధి కుక్కల విషయంలో సంబంధిత స్థానిక సంస్థలు, మునిసిపాలిటీ వారు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని చట్టాలు చెబుతున్నాయి. పిల్లలు, వృద్ధులు వీధి కుక్కల బారిన పడి చనిపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఫిర్యాదు చేస్తే, 'కుక్కలు పారిపోతున్నందున మేము ఏమీ చేయలేకపోతున్నాం' అంటూ చేతులు దులిపేసుకుంటున్నారు అధికారు లు. వాటి నియంత్రణ, స్టెరిలైజేషన్, టీకాల ప్రక్రియ చాలా నిదానంగా జరుగుతుంది. పొరుగువారు భరించలేనంతగా పెంపుడు కుక్క మొరగటం, పెద్దగా అరవటం పబ్లిక్ న్యూసెన్స్ అని తద్వారా అది వేధింపు లేదా చిరాకు కలిగించటమేనంటూ న్యాయస్థానాల తీర్పులున్నాయి. త్రివేణి అపార్ట్‌మెంట్స్



అసోసియేషన్ వర్సెస్ సౌత్ ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ అనే కేసులో ఢిల్లీ హైకోర్టు వీధి కుక్కల నియంత్రణ విషయంలో స్టెరిలైజేషన్, టీకాల ప్రక్రియపై మార్గదర్శకాలను సూచించింది. కుక్కలపట్ల క్రూరత్వం ప్రదర్శించకూడదు అని చట్టాలు చెబుతున్నాయి. నిజమే కానీ అవి దాడి చేస్తుంటే చూస్తూ కూర్చో వాలా అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అవి గాయపరచటమే కాదు కొన్నిసార్లు మనిషిని చంపేస్తున్నాయి. గాయపడిన వ్యక్తి ప్రాణాంతకమైన రేబిస్ వ్యాధి రాకుండా టీకా తీసుకుంటాడు. బాగానే ఉంది. మరి చనిపోయిన వ్యక్తి కుటుంబం ఎంత క్షోభకు గురవుతారు. దీనికి ఎవరు బాధ్యులు? బాధిత కుటుంబం కుక్క యజమాని నుండి లేదా వీధి కుక్కయితే ప్రభుత్వం నుండి నష్టపరిహారం కోరాలి. వారి అజాగ్రత్త లేదా బాధ్యతారాహిత్యం మూలాన దుర్ఘటన జరుగుతుంది కాబట్టి వారిని బాధ్యులను చేయాలి. మద్రాస్ హైకోర్టు, పంజాబ్ హరియాణా హైకోర్టు ఇటువంటి సందర్భాల్లో నష్టపరిహారం మంజూరు చేశాయి. కారు ప్రమాదంలో పెంపుడు కుక్క చనిపోతే లేదా యజమాని కారు నడిపిన వ్యక్తి మీద క్రిమినల్ కేసు వేశాడు. పోలీసు వారు భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 428,429 కింద కేసు రిజిస్టర్ చేశారు. కర్ణాటక హైకోర్టు కారును నడిపిన వ్యక్తికి చంపాలనే దురుద్దేశం లేదని, అది కేవలం యాక్సిడెంట్ మాత్రమేనని ఆ కేసును కొట్టివేసింది. మరి పెంపుడు కుక్క లేదా వీధి కుక్క మనిషికి హాని చేస్తే దాని యజమానిని లేదా ప్రభుత్వాన్ని బాధ్యులుగా చేస్తూ నష్టపరిహారం ఎందుకు కోరకూడదు. జంతువులు మనిషికి హాని చేస్తే, దానికి పరిష్కారమేమిటో పైన ఉదహరించిన జంతు సంరక్షణ చట్టాల్లో పేర్కొని ఉంటే బాగుండేది. 2022 సంవత్సరంలో పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు గౌరవ కేంద్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సమాధాన మిస్తూ కుక్కకాటు లేదా మరణాలకు ఎటువంటి నష్టపరిహారం ఇచ్చే చట్టం లేదని ఉద్ఘాటించారు.

వీధి కుక్కల దాడి, గాయపర చటం, చంపెయ్యటం, వాటిని అరికట్టడం మొదలైన అంశాలపై భారత జంతుసంరక్షణ బోర్డు, సొసైటీ ఫర్ పబ్లిక్ కాజ్ అనే సంస్థ వేసినటువంటి కొన్ని కేసులు 28 ఫిబ్రవరి 2024వ తేదీన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ముందుకు రానున్నది. మనిషి చట్టాల ఉల్లంఘనకు పాటుపడితే కుక్క యజమాని న్యాయం కోసం కోర్టును ఆశ్రయించవచ్చు. కానీ కుక్క చేసే తప్పిదానికి మనిషికి సరైన న్యాయం దొరకాలి. వీటన్నింటికి ఒక ముగింపునిస్తూ అత్యున్నత న్యాయస్థానం నుండి త్వరలో కుక్కకాటుకు మనిషి బలికాకుండా, మనిషి వేటుకు కుక్క బలికాకుండా, మనిషికి, కుక్కకు మంచి న్యాయం దొరుకుతుందని ఆశిద్దాం. ■



కథ

దేవీప్రసాద్ ఒబ్బు

# పేపర్ బాయ్

**"భువనా, పాలగిన్నె ఇలా తీసుకురా. మళ్లీ ముహూర్తం మించిపోతుంది" గ్యాస్ స్టౌకు పసుపు, కుంకుమ బొట్లు పెట్టిన తర్వాత తన కొత్త కోడలిని పిలిచింది రాజేశ్వరి.**

**కొత్తగా అద్దెకు చేరిన ఇంట్లో 'ఏ వస్తువు ఎక్కడ పెట్టాలా?' అని ఆలోచిస్తున్న కోడలు భువన, అత్తగారి పిలుపుతో హాల్లో నుంచి వంటగదిలోకి పరుగున వెళ్లింది.**

అత్తగారి సూచన మేరకు స్టవ్ వెలిగించి పాలగిన్నె పొయ్యి మీద పెట్టింది భువన. గిన్నె వైపే తదేకంగా చూడసాగింది రాజేశ్వరి.

కాసేపటికి గిన్నెలోంచి పాలపొంగు కుడి వైపుకు పొంగింది.

"భువనా, పాలపొంగు కుడి వైపుకు పొంగింది. చాలా మంచిది. మీరు ఏడాదిలోపే హైదరాబాదులో మంచి ఇల్లు కొంటారు" అంది రాజేశ్వరి.

అత్తగారి మాటతో భువన మొహం ఆనందంతో వెలిగిపోయింది.

"అమ్మా భువనా, కాసేపు ఆగి పాలు పొయ్యి మీద నుంచి దించేసి, కాఫీ, టీ పొడి ఏవీ కలపకుండా పాలలో పంచదార కలుపుకుని హాల్లో ఉన్న అందరికీ ఇవ్వు" అని చెప్పి రాజేశ్వరి హాల్లోకి వచ్చేసింది.

కాసేపటి తర్వాత ఒక ప్లేటులో ఆరు గ్లాసుల్లో పాలు తీసుకొచ్చి హాల్లో కుర్చీలలో కూర్చుని ఉన్న తన అత్తమ్మకి, అమ్మా నాన్నకు, భర్త హరీష్‌కి, ఆడబిడ్డ నవ్యకు ఇచ్చి తనూ ఓ గ్లాసు తీసుకుంది భువన.

భువన వాళ్లది విజయవాడకు సమీపంలోని రామాపురం గ్రామం. వ్యవసాయ కుటుంబం. ఊళ్లో విశాలమైన ఓ ఇల్లు, ఆరెకరాల పొలం ఉంది. భువన తన తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు. ఇంటర్ ఏడాది క్రితమే పూర్తి చేసింది. ఇంటర్ తర్వాత ఇక నేను ఏమీ చదవనని భువన తేల్చి చెప్పేయడంతో మంచి సంబంధం కుదిరితే పెళ్లి చేసేద్దామనే నిర్ణయానికొచ్చారు భువన తల్లిదండ్రులు.

దూరపు బంధువుల ద్వారా తిరుపతిలో నివాసం ఉండే రాజేశ్వరి వాళ్ల సంబంధం తెలియడంతో ఆస్తిపాస్తులు లేకపోయినా, అబ్బాయికి మంచి ఉద్యోగం, కుర్రాడు అందంగా ఉన్నాడనుకుని భువనను హరీష్‌కి ఇచ్చి వివాహం చేశారు భువన తల్లిదండ్రులు.



రాజేశ్వరికి ఒక కొడుకు, ఒక కూతురు. భర్త సుందరయ్య బైక్ మెకానిక్ షాపులో పనిచేసేవాడు.

సుందరయ్య పనితనం మెచ్చి యజమాని రోజుకి ఐదు వందలు కూలీ ఇచ్చేవాడు. ఒక్కొక్క రోజు ఐదు వందల కంటే అదనంగా కూడా వచ్చేది. కానీ సుందరయ్యకు తాగుడు అలవాటు ఉండడం వల్ల ఇంట్లో సగం డబ్బులే ఇచ్చేవాడు. అయినా రాజేశ్వరి సర్దుకుపోయేది. తాగుడుకు బానిసైపోవడం కారణంగా ఆరోగ్యం పాడైపోవడంతో హరీష్‌కి ఆరేండ్లప్పుడు సుందరయ్య చనిపోయాడు. అప్పుడు కూతురు నవ్యకి ఏడాది వయసు.

రాజేశ్వరి కొన్ని రోజులు కూరగాయలమ్మింది, కొన్ని రోజులు టిఫిన్ అంగడి పెట్టింది. అష్టకష్టాలు పడి హరీష్‌ని ఇంజినీరింగు చదివించింది.

రాజేశ్వరి కష్టం, తన తెలివితేటలు, అదృష్టంకొద్దీ హైదరాబాద్‌లోని ఓ మంచి కంపెనీలో నెలకు లక్ష వచ్చే ఉద్యోగం సంపాదించాడు హరీష్. కూతురు నవ్య ఇప్పుడు ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతోంది.

అమ్మాయి చదువుకోకపోయినా అందంగా ఉండడంతో పాటు, ఆస్తిపాస్తులున్న మంచి కుటుంబం, పైగా ఒక్క కూతురు కారణంగా సంతోషంగా ఆరు మాసాల క్రితమే హరీష్‌కి వివాహం చేసింది రాజేశ్వరి.

కాపురం పెట్టడానికి ఓ మంచి ఇల్లు చూసుకునేలోపు హరీష్ పదిహేను రోజులకోసారి హైదరాబాదు నుంచి తిరుపతి వచ్చి వెళ్లేవాడు.

ఇప్పుడు అద్దెకు ఇల్లు కుదరడంతో ఇరు కుటుంబాలవాళ్లు హైదరాబాద్ వచ్చారు. తన కూతురు కొత్త కాపురానికి ఫర్నిచర్ నుంచి ఫ్రిజ్ వరకు, బెడ్ నుంచి బీరువా వరకు, వాల్ క్లాక్ నుంచి వాషింగ్ మిషన్ వరకు సమస్తమూ తీసిచ్చేశారు భువన తల్లిదండ్రులు.

భువన తల్లిదండ్రులు, రాజేశ్వరి, నవ్య సహాయంతో ఆరోజు సాయంత్రానికే ఇంట్లో వస్తువులన్నీ సర్దేశారు భువన, హరీష్. మరుసటి రోజు ఉదయమే భువన తల్లిదండ్రులు విజయవాడకు వెళ్లగా, అదేరోజు సాయంత్రం నారాయణాద్రిలో తిరుపతికి తిరుగు ప్రయాణం అయ్యారు రాజేశ్వరి, నవ్య.

...........

మరుసటి రోజు ఉదయం భువన, హరీష్, ఇంటిగుమ్మం బయట కుర్చీలలో కూర్చుని కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటుండగా న్యూస్ పేపరు గుర్తొచ్చింది హరీష్‌కి. హరీష్‌కి ఉదయం కాఫీ తాగుతూ న్యూస్ పేపరు చదవడం అలవాటు. ఇంట్లో చేరే హడావుడిలో ఈ రెండు రోజుల్లో న్యూస్ పేపరు సంగతి మరచిపోయాడు.

"కాఫీ తాగిన తర్వాత బజారుకెళ్లి పేపరు తెచ్చుకుందాంలే" అని అనుకుంటుండగా– సైకిలు మీద వచ్చిన ఓ కుర్రాడు గేటు దగ్గర నుంచి పక్క పోర్షన్ గుమ్మం ముందు న్యూస్ పేపరు విసిరికొట్టి వెళ్తుండగా "బాబూ, రేపటి నుంచి మాక్కూడా పేపర్ వేయ్" అన్నాడు హరీష్.

హరీష్, భువన ఉండే కాంపౌండులో కింద ఉన్న రెండు పోర్షన్లలో ఒక దాంట్లో హరీష్‌వాళ్లు అద్దెకు చేరారు. పైనున్న ఒకే పోర్షన్లో ఓనర్స్ ఉంటారు.

"అలాగే సార్. నిన్ననే మిమ్మల్ని అడుగుదామని అనుకున్నాను. మీరు మీ పనుల్లో బిజీగా ఉండడం చూసి వెళ్లిపోయాను. ఇంతకుముందు ఈ ఇంట్లో ఉన్నవాళ్లు కూడా వేసుకునేవారు. ఏ పేపరు వేయమంటారు?" అన్నాడు పేపర్ బాయ్.

"ఏదైనా పర్లేదు" అని హరీష్ చెప్పడంతో–

"సరే సార్, ఈరోజు నుంచే వేసుకోండి సార్" అని చెప్పి సైకిలు దిగి వచ్చి హరీష్ చేతికి పేపరు ఇచ్చి వెళ్తుండగా "బాబూ, నీవు చదువుకోవడం లేదా?" అడిగాడు హరీష్.

"పదవ తరగతి సార్" అన్నాడు ఆ కుర్రాడు.

"మరి పేపర్ వేస్తున్నావ్?" ఆశ్చర్యంగా అడిగాడు హరీష్.

"పేపర్ వేయడం ఏడు గంటలకి అయిపోతుంది సార్. తర్వాత స్కూలుకి వెళ్తాను. స్కూలు తొమ్మిది గంటలకు కదా సార్" అని చెబుతూనే సైకిలు మీద వెళ్లిపోయాడు పేపర్ బాయ్.

"ఏమండీ, ఆ అబ్బాయి చూడండి చదువుకుంటూనే పేపర్ వేస్తున్నాడు. చాలా గ్రేట్ కదండీ" అంది భువన.

"అవును భువనా, బాధ్యత కలిగిన ఇలాంటి పిల్లలు అరుదుగా ఉంటారు" అంటూ పేపరు చదవడం మొదలెట్టాడు హరీష్.

పేపర్లో కొన్ని పేజీలు చదివిన తర్వాత "భువనా, వేడినీళ్లు పెట్టు, ఇవాళ ఆఫీసుకి త్వరగా వెళ్లాలి. రెండ్రోజులు సెలవు పెట్టాను కదా ఇవాళ బాసు కాస్త ముందుగా రమ్మని నిన్ననే ఫోన్ చేశాడు" అని హరీష్ చెప్పగానే భువన వంటింట్లోకి వెళ్లింది.

…………

మూడు మాసాల తర్వాత ఓరోజు ఉదయం భువన, హరీష్ ఇంటి గుమ్మం బయట కుర్చీలలో కూర్చుని కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటుండగా సైకిలు మీద వచ్చిన పేపర్ బాయ్‌ని చూస్తూనే హరీష్‌కి ఓ విషయం గుర్తుకు వచ్చింది.

పేపర్ బాయ్ సైకిల్ దిగి రెండు న్యూస్ పేపర్లు ఒక చేత్తో, మరో చేత్తో సైకిల్ హ్యాండిల్‌కి తగిలించిన క్లాత్ సంచిని తీసుకుని చక్కనైన చిరునవ్వుతో వస్తుండగా "ఆనంద్, ఎన్ని మార్కులు వచ్చాయి?" అడిగాడు హరీష్.

"సార్, ఆరు వందలకు ఆరువందలు వచ్చాయి సార్, నేనే స్టేట్ ఫస్ట్ సార్. స్వీట్స్ తీసుకోండి సార్" అని చెబుతూ స్వీట్ బాక్స్ హరీష్ చేతికిచ్చి కాళ్లకు నమస్కారం చేయబోయాడు.

హరీష్ వెంటనే కుర్చీలోంచి పైకి లేచి ఆనంద్ కాళ్లకు నమస్కారం చేయడాన్ని వారిస్తూ "వావ్, వండర్‌ఫుల్ మై డియర్ బాయ్. హార్టీ కంగ్రాచ్యులేషన్స్" అంటూ ఆనంద్‌ని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నాడు.

తర్వాత కాస్త వెనక్కి

**"ఇప్పుడే వస్తాను ఆనంద్" అని చెప్పి ఇంట్లోకెళ్లి, కాసేపటి తర్వాత వచ్చి "ఆనంద్, దీంతో సైకిలు కొనుక్కో" అని ఐదు వేలు ఆనంద్ చేతిలో పెట్టాడు హరీష్.**

వచ్చి "ఆనంద్, రిజల్ట్స్ నిన్ననే వస్తాయని, నిన్న ఉదయం నీవు ఫోన్ చేసి చెప్పినప్పుడు ఎన్ని మార్కులు వచ్చాయో సాయంత్రం ఫోన్ చేయమని చెప్పాను. కానీ ఆఫీసుపని హడావుడిలో పడి నీ రిజల్ట్స్ సంగతి మరచిపోయాను. అందుకే నిన్న సాయంత్రం ఫోన్ చేసినా నా ఫోన్ సైలెన్స్‌లో ఉండడం వల్ల ఫోన్ లిఫ్ట్ చేయలేకపోయాను.

రాత్రి పదకొండు గంటలకు ఇంటికొచ్చి ఫోన్ చూస్తే నీ నుంచి మూడు మిస్డ్ కాల్స్ ఉన్నాయి. ఆ టైంలో ఫోన్ ఎందుకు చేయడమని ఊరుకున్నాను" అన్నాడు హరీష్.

"మీ గురించి, నా గురించి పేపర్లో కూడా వేసారు సార్" అని తన చేతిలో ఉన్న పేపర్ హరీష్‌కి చూపించాడు ఆనంద్.

– పది ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ వచ్చిన పేపర్ బాయ్.

– అతని విజయానికి చేయూతనిచ్చిన యువ ఇంజినీరు.

..అని మొదటి పేజీలో పెద్ద అక్షరాలతో రాసిన వార్త చూసి హరీష్ ఎంతో సంతోషించాడు.

"ఇప్పుడే వస్తాను ఆనంద్" అని చెప్పి ఇంట్లోకెళ్లి, కాసేపటి తర్వాత వచ్చి "ఆనంద్, దీంతో సైకిలు కొనుక్కో" అని ఐదు వేలు ఆనంద్ చేతిలో పెట్టాడు హరీష్.

"సార్, ఇప్పటికే మీరు చాలా సహాయం చేసారు. మళ్లీ ఇప్పుడు డబ్బులు ఎందుకు సార్" అని డబ్బులు తీసుకోడానికి తడబడుతుండగా "బాధ్యతగా చదివే నీ లాంటి పిల్లలకు ఎంత సహాయం చేసినా నష్టం లేదు. ఇంటర్మీడియెట్‌లో కూడా ఇదే విధంగా స్టేట్ ఫస్ట్ రావాలి" అని ఆనంద్ భుజాన్ని తట్టగానే, ఆనంద్ కళ్ల నుంచి ఆనంద భాష్పాలు అప్రయత్నంగా కారిపోతున్నాయి. ఆ ఆనందంతోనే "మీ మేలు ఎప్పటికీ మరచిపోను సార్" అని హరీష్ కాళ్లకు నమస్కారం చేసాడు.

ఆనంద్ రెండు భుజాలను పట్టుకుని పైకి లేపి "మంచి మార్కులు వచ్చిన సందర్భంగా మీ అమ్మగారితో, నీ


## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా:**

**ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

స్నేహితులతో సెలబ్రేషన్స్ చేసుకోకుండా ఇవాళ కూడా పేపర్ వేస్తున్నావే" అన్నాడు హరీష్.

"ఇన్నాళ్లు ఇంటి బాధ్యత కోసం పేపర్ వేశాను సార్. ఇవాళ మాత్రం గర్వంగా వేస్తున్నాను సార్ మీ దయవల్ల. చదువు పూర్తైపోయి ఉద్యోగం వచ్చేంత వరకు పేపరు వేయడం మాత్రం మానను సార్. పేపరు వేయడంవల్లే కదా మీలాంటి మంచి వ్యక్తి నాకు పరిచయమయ్యారు. మీరు లేకపోతే నేను ఏ కూలీగానో ఉండిపోయేవాడ్ని సార్" అన్నాడు ఆనంద్ చెమ్మగిల్లిన కళ్లతో.

"ఇందులో నాదేముంది ఆనంద్.. నేను చేయూత మాత్రమే ఇచ్చాను. నీవు కష్టపడి బాధ్యతగా చదవడంవల్లే ఇవాళ ఇంత విజయం సాధించగలిగావు. సరే.. ఇక నీవు బయలుదేరు ఆనంద్" అని హరీష్ చెప్పడంతో–

కృతజ్ఞతా భావంతో భువన, హరీష్‌లకు నమస్కరిస్తూ పక్క పోర్షన్లో పేపరు వేసి సైకిలు మీద వెళ్లిపోయాడు పేపర్ బాయ్ ఆనంద్.

ఇంతసేపు అక్కడ ఏమి జరుగుతుందో అర్థంకాని భువన "ఏమిటండీ, పేపర్ బాయ్‌కి ఆరు వందల మార్కులు రావడం ఏమిటి? అతనికి మీరు సాయం చేయడమేమిటి? ఆ విషయం పేపర్లో వేయడం ఏమిటి? అసలు ఇక్కడ ఏం జరుగుతుందో నాకేమీ అర్థం కావడంలేదు" అంది ఆశ్చర్యంగా.

"భువనా, నీకు చెప్పడం మరచిపోయాను. రెండు మాసాల ముందు వరుసగా మూడు రోజులు పేపర్ బాయ్ రాలేదు. అప్పుడు ఇంకొకతను వచ్చాడు. అతనికి సుమారు ఇరవై నుంచి ఇరవై ఐదు మధ్య ఉంటుంది వయస్సు. ఆ పిల్లాడు ఎందుకు రాలేదని? అతనిని అడిగాను. అడప్పుడతను "వాళ్ల నాన్న చనిపోయాడంట సార్" అని చెప్పాడు గుర్తుందా?" అని అడిగాడు హరీష్.

భువన కాసేపు ఆలోచించి "అవును" అంది.



"ఆ తర్వాత ఓరోజు నేను ఆ అబ్బాయి వాళ్లింటికి వెళ్లాను. గుట్కాలు ఎక్కువ వేయడం వల్ల నోటి కేన్సర్‌తో వాళ్ల నాన్న చనిపోయాడని తెలిసింది. పుట్టుకతో రెండు కాళ్లు పోలియో కారణంగా వాళ్ల అమ్మ నడవలేదు. కానీ కూర్చుని ఏ పనైనా చేయగలదు. ఆ కుటుంబానికి ఏకైక ఆధారంగా ఉన్న వాళ్ల నాన్న చనిపోవడంతో కుటుంబ బాధ్యత ఆనంద్ మీద పడింది. అందుకే స్కూలు మానేసి హోటల్లో బేరర్ పని చేస్తున్న వాళ్ల నాన్న ఉద్యోగంలో చేరాడు ఆనంద్. కానీ ఆనంద్ బాగా చదువుతాడనీ, స్కూల్లో అన్నీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటాడని తెలిసింది. అలాంటి విద్యార్థి స్కూలు మానేయడం బాధ అనిపించింది. అందుకే సహాయం చేయాలనుకున్నాను" అన్నాడు.

"ఆనంద్‌కి మీరు ఏ సహాయం చేశారు?" ఉత్సుకతతో అడిగింది భువన.

"అతనికి సహాయం చేయడానికి అసలు కారణం ఏంటంటే– మొదటిసారిగా పేపర్ వేయడానికి ఆనంద్ మనింటికి వచ్చినప్పుడు అతణ్ణి చూడగానే నా చిన్నతనం గుర్తొచ్చింది. మెకానిక్ షాపులో కూలీగా పనిచేసే మా నాన్నకు అతిగా మద్యం తాగే అలవాటు ఉండడం వల్ల లివర్ పాడైపోయి నాకు ఆరేండ్లప్పుడే మా నాన్న పోయాడు. అప్పుడు మా పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది. ఆ సమయంలో మా అమ్మ అధైర్యపడకుండా కొన్నాళ్లు కూరగాయలమ్మింది, కొన్నాళ్లు టిఫిన్ అంగడి పెట్టింది. అప్పుడు మా అమ్మ పడుతున్న కష్టం చూసి నేనూ ఏదో ఒక పని చేసి మా అమ్మకు సహాయపడాలనే ఉద్దేశంతో ఎనిమిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు పేపర్ బాయ్‌గా పని చేశాను. తండ్రి లేని కుటుంబం ఆర్థికంగా, సమాజ పరంగా ఎంత నరకం చవిచూస్తుందో ప్రత్యక్షంగా అనుభవించాను కాబట్టే నడవలేని ఆనంద్ వాళ్ల అమ్మకు ఇంటి దగ్గర్లో కూరగాయల షాపు పెట్టుకోవడానికి అవసరమైన డబ్బులు ఇచ్చాను. ఆనంద్ చదివేది గవర్నమెంటు స్కూలు అయినా అతనికి అవసరమైన నోటు పుస్తకాలు, బట్టలు కొనిచ్చాను. నేను చేసిన సహాయాన్ని వృథా కానీయకుండా వాళ్ల అమ్మకు పనిలో చేదోడు వాదోడుగా ఉంటూ, ఒక పక్క పేపర్ వేస్తూ మరోపక్క శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకున్నాడు ఆనంద్" అని జరిగినదంతా చెప్పాడు హరీష్.

అంతా శ్రద్ధగా విన్న భువన "చాలా మంచి పని చేశారండీ" అంది చిరునవ్వుతో.

"ఉపాధ్యాయుడి వద్ద విద్యనభ్యసించిన విద్యార్థి ప్రయోజకుడై తిరిగి వచ్చి ఉపాధ్యాయుడి వద్ద ఆశీర్వాదం తీసుకుంటున్నప్పుడు విద్యార్థి కళ్లల్లో ఆనందం చూసి ఉపాధ్యాయుడు ఎలా సంతోషిస్తాడో, అలాంటి ఆనందాన్నే నేనిప్పుడు ఆనంద్ కళ్లల్లో చూశాను. ఒక మనిషికి ఇంతకన్నా సంతృప్తి ఏముంటుంది చెప్పు భువనా?" అని హరీష్ సంబరపడిపోవడం చూసి తన తల్లి పడే యాతనను చూసి తట్టుకోలేక ఆమెకు చేయూతనివ్వడం కోసం చిన్నతనంలోనే తనూ పేపర్ బాయ్‌గా మారడం, దిక్కులేని ఆపదలో ఉన్నప్పుడు స్పందించి సహాయం చేసే మంచి మనస్తత్వం గల వ్యక్తి లభించినందుకు భువన మనస్సు కూడా ఆనందంతో నిండిపోయింది.

✦


## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:**
**నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**
**sunmagvaartha@gmail.com**

జయసూర్య

# సాహితీ ప్రస్థానంలో 'పురిపండా'

మహాభారతం, రామాయణం, భాగవతం మూడింటినీ వాడుక భాషలో రాసిన పురిపండా అప్పలస్వామి, తెలుగు సాహిత్యంలో అభ్యుదయ ఉద్యమానికి సారధ్యం వహించిన తొలి తరం సాహితీవేత్తగా ఖ్యాతి పొందారు. 1926 మే 6న పురిపండా, వడ్డాది సీతారామాంజనేయులు, శ్రీశ్రీ ముగ్గురూ కలిసి స్థాపించిన కవితా సమితి నాటి తెలుగు నవ్య సాహిత్యంలో కొత్త కాంతి ప్రసరింపచేసింది. నాటి గ్రాంథికవాదులు, వ్యవహారికవాదులు, సనాతన, నవ్య, అతినవ్య, అన్ని పంథాల సాహితీవేత్తలు సభ్యులుగా కవితా సమితి పాతిక పైగా గ్రంథ ప్రచురణలు, వైశాఖి సంచికలు, సభలు, సమావేశాలు, సమ్మేళనాలు అభ్యుదయ సాహితీ సేవలందించింది. ఉత్తరాంధ్ర శ్రీకాకుళం, ఒరిస్సా, విశాఖపట్నం, విజయనగరం, బరంపురం ప్రాంతాలలో నాటి తెలుగు సాహితీ సమారాధకునిగా అప్పలస్వామి విశేష సేవలందించారు. 1925 విశాఖలో కర్రా సీతారామయ్య స్థాపించిన 'స్వశక్తి' వారపత్రిక సహాయ సంపాదకునిగా వున్న అప్పలస్వామి, అప్పుడు 15 ఏళ్ల వయస్సు వున్న శ్రీశ్రీ గీతమాలిక 'దివ్యలోచనములు' తొలి రచన ప్రచురింపచేసారు.1904 నవంబరు 13న శ్రీకాకుళంలో జన్మించిన 'పురిపండా' స్వయంకృషితో హిందీ, బెంగాల్, ఒరియా, ఇంగ్లీష్, సంస్కృతం, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం పొందారు. తొలి రచనలు త్రిలింగ, ఆంధ్రపత్రిక, జ్యోతి(బరంపురం) పత్రికలలో వచ్చాయి.

తొలి పుస్తకం 'రాట్న పతాకం' 1921లో వెలుగు చూసింది. తర్వాత అడిదము సూరకవి ప్రణీతమైన 'కవి సంశయ విచ్ఛేదం' పరిష్కరించి ప్రచురించారు. గాంధేయవాదిగా స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో దేశభక్తి గీతాలతో విశాఖ కార్య క్షేత్రంగా భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రతినిధిగా దేశారాధన చేసారు. పత్రికా రచయితగా వ్యాసాలు, వార్తలు, సంపాదకీయాలు స్వశక్తి, సత్యవాణి, సమదర్శిని వంటి పత్రికలు, గ్రంథాలయోద్యమం నిర్వర్తించేవారు. 1933 డిసెంబరు 10వ తేదీన కవితా సమితి విశ్వకవి రవీంద్రుణ్ణి సత్కరించడం వంటి చారిత్రక ఘట్టాలు ఎన్నింటికో తెలుగునాట పురిపండా అధ్యక్షునిగా నిర్వర్తించారు. 1928లో మే 15న భీమునిపట్నంలో సకలాంధ్ర కవి సమ్మేళనం ఆంధ్ర సాహిత్య అభ్యుదయోద్యమంలో పురిపండా కార్యదర్శిగా చరిత్ర సృష్టించింది.

1928 వరకు పురిపండా గ్రాంథికంలో రచనలు కొనసాగించారు. వ్యవహారిక భాషోద్యమ నేత గిడుగు రావ మ్మూర్తి ఉద్యమోత్తేజంతో పురిపండా భాగవత, రామాయణ, మహాభారత ఉద్గ్రంథాలు వ్యావహారికంలో రచించారు. ప్రమదా పరిణయము గద్య పద్యాల నవ్యగ్రంథం, రాట్న పతాకం కంద పద్యాల గాంధీ సందేశం, 1927లో మహమ్మద్ చరిత్ర, 1927లోనే మురళీధ్వని, 1931లో ఉత్కల పతనం, తర్వాత నక్రమేపీ ప్రౌఢ గ్రాంథికానికి స్వస్తి చెప్పి గేయాలు, ఖండకావ్యాలు, సౌదామిని, పులిపంజా కావ్య సంపుటాలు, తరువాత 1957లో వీరభారతం 1857 స్వాతంత్ర్య సమర చరిత్రతో సుప్రసిద్ధులయ్యారు. సౌదామినిలో కొన్ని పద్యాలు, గేయాలు శ్రీశ్రీ ఆంగ్లంలోకి అనువదించారు. 1953లో అనకాపల్లిలో వివిధ సాహితీ సంస్థలు మహాకవి బిరుదు ప్రదానం చేసాయి.




పురిపండా వ్యాసావళి, జగద్గురు శంకరాచార్య, భోమాణ ఆరగుంత, విశ్వకథావీధి, పిల్లల కథా సాగరం, ముందడుగు, అభిజ్ఞాన శాకుంతలం, వాత్స్యాయనీయం, హంగేరీ విప్లవం, మట్టిమనుషులు, అమృత సంతానం, దేవీ భాగవతం అరవై పైగా గ్రంథాలు రచించారు. హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, ఒడిషా, బంగ్లా భాషల నుంచి ఎన్నో అనువాదాలు, వివిధ ప్రాంతాల చరిత్ర, సాహిత్య వ్యాసాలు రాసారు. ఒడిషాలో ఆంధ్ర సాహిత్య చరిత్ర, మట్టిమనుషులు, అమృత సంతానం తెలుగు అనువాదం చేసారు. పురిపండా రచన 'ప్రాచీన యోధ స్మృతి' హిందీ అనువాదం 'ఒడిశా పాలేరు పాటలు' సింధీ యితర భారతీయ భాషలలోకి ఎన్నో అనువదింపబడ్డాయి.

నవ్యకవిగా, కథకునిగా, విమర్శకునిగా, వ్యాసకర్తగా, అనువాదకునిగా, తెలుగు సారస్వతంలో విప్లవాత్మక పరిణామాలకు ప్రగతిశీల సాహితీవేత్తగా పురిపండా సాహితీ ప్రస్థానం కొనసాగింది.

1904 నవంబరులో జన్మించిన పురిపండా అప్పలస్వామి 1982 నవంబరు 18న కన్ను మూసారు. ఎక్కడ వున్నా, ఎలా వున్నా తెలుగు సాహిత్యమే సర్వస్వంగా జీవించారు. భాషా, భావపరంగా అభ్యుదయానికి తెలుగు సాహితీ సీమలో ప్రత్యక్షంగా పరోక్షంగా తెలుగునాట మార్గదర్శకునిగా ఎందరో కవులకు, సాహితీవేత్తలకు జీవితాదర్శంగా దారి చూపించి మాతృభాషాభిమానిగా తెలుగును సంపన్నవంతం చేసారు.

**తొలినాటి సంద్రాలు**
**తుహినగిరి శిఖరాలు**
**ఇంకిపోతున్నాయిలే**
**కుంగిపోతున్నాయిలే.. అంటూ**
**రాజు కట్టిన కోట**
**రాణి మెట్టిన తోట**
**భూతాలు గెంతాయిలే**
**బొమికలే నిండాయిలే**
**సుడిగాలి రేగిందిలే**
**పిడుగు గర్జించిందిలే**

సామ్యవాదిగా, వ్యవహారిక భాషోద్యమ సారధిగా, మాతృభాషను ప్రగతిశీల భావోత్తేజంతో రచయితగా అభ్యుదయం వైపు అడుగులు వేయించిన పురిపండా అప్పలస్వామి చిరస్మరణీయులు.

# జరిగేది జరుగుతుంది..

యామిజాల జగదీశ్

అనగనగా ఓ ఊరు. ఆ ఊళ్లో ఓ సాధారణ మనిషి గుర్రబ్బండి మీద పోతున్నాడు. ఆ గుర్రబ్బండి పాడైపోయి ఉంది. అదే అతని ఆస్తి. దాన్ని ఆధారంగా చేసుకుని అతను రోజులు గడుపుతున్నాడు.

ఓరోజు అతను ఆ బండిలో ఎక్కడికో పని మీద వెళ్లి తిరిగొస్తున్నాడు. అప్పుడు ఆ గుర్రం ఓ చోట కాలు జారి కింద పడిపోయింది. దాని కాలు విరిగింది.

ఊళ్లో ఉన్న వాళ్లందరూ గుర్రాన్ని, అతని పరిస్థితిని చూసి జాలి పడ్డారు. "అయ్యో, పాపం. ఇలా అయిపోయిందేమిటీ.. ఇక అతను ఎలా జీవిస్తాడని?" అందరూ బాధపడ్డారు.

కానీ అతనిలో ఏమాత్రం విచారం కనిపించలేదు. "జరిగేది జరుగుతుంది... చూసుకుందాం!" అని అతను రోజులు గడుపుతున్నాడు. గ్రామస్తులకు అతనిని చూసి ఆశ్చర్యం వేసింది. అతను ఎలా నింపాదిగా ఉంటున్నాడని? వారి ప్రశ్న.

అతని ఆస్తనుకున్న గుర్రబ్బండి గుర్రంకాలు విరగడంతో ఎందుకూ పనికిరాకుండా పోయినా అతనిలో దిగులు కనిపించడం లేదు. దేనికీ చలించడం లేదని వారి ఆశ్చర్యం! వాళ్లు పొరుగున వున్న అడవికి వెళ్లి కొత్తగా ఓ గుర్రాన్ని పట్టుకుని వచ్చి అతనికి కానుకగా ఇచ్చారు.

ఆ విషయాన్ని కొందరు గమనించారు. వాళ్లు అతనిని చూసి "నువ్వు అదృష్టవంతుడివి. కాలు విరిగి ఎందుకూ పనికిరాకుండా మూలన పడ్డ గుర్రానికి బదులు నీకు ఇప్పుడు మరొక గుర్రం లభించిందిరా!" అన్నారు.

వారలా అన్నప్పటికీ అతనేమీ గొప్పలు పోలేదు. చిన్న నవ్వు నవ్వాడు. జరిగేది జరుగుతుంది.. మనం ఏం చేసినా జరగాలని రాసిపెట్టి వుంటే తప్పక జరుగుతుంది. మన చేతిలో ఏమీ లేదు. అంతా భగవంతుడి దయ" అన్నాడు.

కొన్ని రోజులు గడిచాయి. ఏం జరిగిందో తెలుస్తాండీ.. అడవిలో నుంచి ఊరిజనం పట్టుకొచ్చి అతనికి కానుకగా ఇచ్చిన గుర్రం ఓరోజు అతని దగ్గర నుంచి పారిపోయింది. ఎటు పోయిందో తెలీదు.

విషయం తెలిసినవారు "అయ్యో పాపం! మనం ఎంతో మంచి మనసుతో గుర్రం ఇస్తే అది కూడా పారిపోయింది కదా!" అని అతని పరిస్థితికి బాధపడ్డారు. కానీ అతను నింపాదిగా ఉన్నాడు. ఏమాత్రం బాధ పడలేదు. జరిగేది జరగక మానదు.. అనుకున్నాడు.

మరికొన్ని రోజులయ్యాయి. పారిపోయిన గుర్రం మరో అర డజన్ గుర్రాలను కూడగట్టుకుని అతని వద్దకు తిరిగొచ్చింది. అప్పుడూ అతనేమీ గర్వపడలేదు, మామూలుగానే ఉన్నాడు. ఊరి జనమంతా అతని దగ్గర అన్ని గుర్రాలు ఉండటం చూసి ఆశ్చర్యపడ్డారు.

"నువ్వు నిజంగా అదృష్టవంతుడివి.. పోయిందనుకున్న గుర్రం ఓ ఆరు గుర్రాలతో నీ దగ్గరకు తిరిగి వచ్చింది కదా!" అన్నారు. వారలా చెప్పినప్పటికీ అతనేమీ గర్వపడలేదు. మామూలుగానే ఉన్నాడు.



ఎప్పటిలాగా "జరిగేది జరుగుతుంది" అన్నాడు.

ఆ తర్వాత ఓ రోజు అతని ఏకైక కుమారుడు ఆ ఆరు గుర్రాలను కంటికి రెప్పలా చూసుకుంటూ వచ్చాడు. వాటిని బండికి కట్టి నడిపించడం నేర్చుకున్నాడు. అయితే ఓ రోజు అతని దగ్గరున్న ఏడు గుర్రాలలో ఒకటి అతని కుమారుడి కాలిని బలంగా తన్ని తీవ్రంగా గాయపరిచింది. అయినప్పటికీ అతను ఏమాత్రం చలించకుండా నింపాదిగా ఉన్నాడు. జరిగేది జరగక మానదు.. అనుకున్నాడు. మన చేతుల్లో ఏమీ లేదన్నాడు.

కానీ ఊరిజనం మాత్రం అతని కుమారుడి పరిస్థితికి జాలిపడ్డారు. అతను మాత్రం వారి మాటలు విన్నప్పటికీ ఏమాత్రం బాధ పడలేదు. జరిగేది జరుగుతుందనుకున్నాడు.

కొన్ని రోజులు గడిచాయి. అతనుంటున్న దేశానికి మరొక దేశానికి మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఊరిజనం సహాయం ఆశించిన రాజు ప్రతి ఇంటి నుంచి ఒక్కో యువకుడు తప్పనిసరిగా ముందుకు వచ్చి యుద్ధం చేయాలని చాటింపు వేయించాడు. ఈ ఆదేశాన్ని ఎవరూ ఉల్లంఘించకూడదన్నాడు.

అయితే కాలు విరిగిన అతని కొడుకు యుద్ధానికి వెళ్లక్కర్లేదు. ఎందుకంటే ఒంటికాలితో పోరాడే శక్తి ఉండదని అతనిని బలవంతం చేయలేదు. అయినప్పటికీ అతనిని చూసి "నువ్వు చాలా అదృష్టవంతుడివి. నీ కుమారుడికి విరిగిన కాలు కావడంతో యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. ఊరి జనమంతా అలా చెప్తున్నాసరే అతను మాత్రం ఎప్పట్లాగా మామూలుగానే ఉన్నాడు. జరిగేది జరుగుతుందన్నాడు. ఆ మాటకు కట్టుబడి ఉండటం అతని సిద్ధాంతం.

ఇది ఒక కథ. ఇంట్లో తాతయ్యలు, బామ్మలు ఉంటే ఈ కథ వారికి తెలిసే ఉంటుంది. వారు ఇతరులకు చెప్తారు కూడా. కథ అదోలా ఉన్నప్పటికీ మనం తెలుసుకోవలసిన విషయం ఒకటుంది.

జీవితంలో కష్టసుఖాలనేవి సర్వసహజం. కష్టమొచ్చినప్పుడు డీలా పడటం, సుఖాన్ని చవిచూసినప్పుడు విర్రవీగకుండా మామూలుగా ఉండటం అనేది ఎంతో ముఖ్యమని అక్కడి వారన్నారు.

.........

ఓ గుర్రప్పందెం జరుగుతోంది. ఒకడు ఒక గుర్రం మీద బెట్టు కట్టాడు. కానీ అది గెలవలేదు.

అప్పుడు పక్కనున్నతను చెప్పాడు. "నువ్వు డబ్బు కట్టావు కదా! ఆ గుర్రం పరుగెత్తనేలేదు. అది తన మానాన నడుచుకుంటూ పోతోంది"

అతను "జరిగేది జరగక మానదు" అని అన్నాడు.

సింగిల్ పేజీ కథ

# గురు బ్రహ్మ

పి.గిరి

"రచయితగా మన మహేంద్ర గారికి ఇంత చిన్న వయసులో సాహిత్య రత్న బిరుదుతో పాటు తాను రచించిన 'కొవ్వొత్తి'కి జాతీయ అవార్డు రావడం మన ఊరికే కాదు యావత్తు దేశానికే గర్వకారణం. ఓనమాలు దగ్గర నుండి పదవ తరగతి వరకు పాఠశాలలో చదివి ఉన్నత విద్యను అభ్యసించడానికి హైదరాబాద్ వెళ్లి అక్కడ చక్కని విద్యను నేర్చుకుని పిన్న వయసులోనే ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి ఇప్పుడు మన మండల కేంద్రానికి మండల అధికారిగా విధులు నిర్వహిస్తూ తన ప్రవృత్తి అయిన రచనా వ్యాసంగంలో అత్యంత ఉన్నతమైన స్థాయిలోకి వెళ్లి మనందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు మన ఊరివాడైన మహేంద్రగారు" అని వేదిక పైన నా గురించి ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దయాకర్ చెప్తుంటే నా కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

"అక్షరంముక్క రాదు వీడికి. ఎంత దిద్దించినా చదువు ఒంటబట్టడం లేదు మల్లయ్యా అని మా నాన్నతో చెప్పిన రాములు మాస్టరుగారు నాకు గుర్తుకు వచ్చారు" తడిసిన నా కళ్ళు నన్ను నా జ్ఞాపకాల గతంలోకి తీసుకెళ్లాయి.

............

రాములు మాస్టారు గారిది మా ఊరే. 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలుగు వాచకం బోధిస్తూ కొన్ని సార్లు సాంఘిక శాస్త్రం కూడా చెప్పేవారు. స్వాతంత్ర్య పోరాటం గురించి తన స్వీయ కవితలు చదివి వినిపించేవాడు. ఆ కవితలు వింటున్న నాకు పోరాటం అంటే ఏంటి? చేపట్టిన లక్ష్యాన్ని ఎలా నెరవేర్చాలి? అప్పగించిన బాధతను ఏ విధంగా నిర్వహించాలి? అనుకున్నది సాధించాలంటే మన కార్యదీక్ష ఏ విధంగా ఉండాలి? ఇత్యాది విషయాల పైన పూర్తి అవగాహన నన్ను ఆవహించింది. అక్షరాలను ఎలాగైనా నేర్చుకోవాలి అనే పట్టుదలనే పెట్టుబడిగా పెట్టుకుని రాములు సార్ చెప్పినట్టు అక్షరాలు దిద్దుకుంటూ ఆలోచనా విధానం మార్చుకుంటూ కదిలాను.

నాతో పాటు నా తోటి విద్యార్థులకు ఆయన నేర్పించిన పాఠాలు బాటలుగా మారి వారి వారి భవిష్యత్తుని బంగారం చేసాయి.

సార్ రాస్తున్న కవితలు, వ్యాసాలు చదువుతుంటే "నా అక్షరాలు మాత్రమే చదివితే సరిపోదురా మహేంద్రా, బడి వదిలిన తరువాత రోజూ గ్రంథాలయానికి వెళ్లు" అని నన్ను గ్రంథాలయం వైపు నడిపించారు. నాతో పాటు గ్రంథాలయానికి వచ్చి అక్కడ నేను చదవాల్సిన రచనలు వాటి గొప్పతనం వివరించేవారు మాస్టారు. ఎన్నో పుస్తకాలు కొనిపెట్టి నన్ను చదివించి, రచనలు చేసే విధంగా చెక్కిన శిల్పి మా మాస్టారు.

మాస్టారు గారు నన్ను కన్నకొడుకులా చూసుకునే విధానం నన్ను ఎంతగానో ప్రభావితం చేసింది.

............

"సార్! మీరు మాట్లాడాలి" అని మైకు చేతికి ఇస్తూ నన్ను కదుపుతుంటే ఈ లోకంలోకి వచ్చాను. సారీ...సారీ.. అంటూ కళ్లనీళ్ల తుడుచుకుంటూ మైక్ అందుకొని లేచి నిలబడ్డాను.

చుట్టూ పాఠశాల ఆవరణ అంతా ఒకసారి పరికించి చూశాను. ఇంకా నేను చెట్ల కింద కూర్చుని చదువుకున్న ఓ జ్ఞాపకం గుండెను వీడి వెళ్లలేదు. ఆ తడి ఇంకా తడిగానే ఉంది.



గొంతు సవరించుకుని "నా మీద అభిమానంతో మీరు నన్ను సత్కరిస్తున్న తీరు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది" అని అనగానే సభా ప్రాంగణంలోని వారంతా చప్పట్లు కొట్టారు.

మళ్లీ కొనసాగిస్తూ "నేను ఈ ఊరి గడ్డపైనే పుట్టాను. ఈ చెట్లు, ఈ గాలి, ఈ నేల నాకు నేస్తాలు. విద్య అనేది అరిగిపోదు ఆవిరైపోదు. దొంగలు దోచుకెళ్లాలన్నా దోచుకెళ్లలేనిది. పంచుకుంటే పెరుగుతుంది తప్ప తరిగిపోదు విద్య. అప్పటికప్పుడు ఆకలి తీర్చే అన్నదానం కన్నా జీవితమంతా ఆకలి తీర్చే విద్యాదానం ఇంకా గొప్పది.

నేను ఈరోజు ఇలా హితబోధ చేస్తున్నానంటే అందుకు కారణం డబ్బు, హోదా, పలుకుబడి, అధికారం కాదు.. కేవలం చదువు. చదువు నా దగ్గర ఉంది కాబట్టే నేను ఇప్పుడు ఇలా మీ ముందు నిలబడ్డాను. నా ఎదుగుదలకు నేను వేసిన ప్రతి అడుగులో అడుగడుగునా జ్ఞానం అందించిన నా గురువు రాములుసార్, నాకు జన్మనిచ్చిన నా తల్లిదండ్రులు బుచ్చమ్మ, మల్లయ్యలు ఎల్లప్పుడూ నాకు చేదోడుగా నిలిచి నన్ను ఈ స్థాయిలో నిలబెట్టారు. ఎందరో గురువులు నాకు వివిధ స్థాయిల్లో తమ జ్ఞానాన్ని ప్రసాదించారు.

అక్షరం ముక్క రావడం లేదు అని మా నాన్నకు చెప్పిన మా మాస్టారు "వీడు తప్పకుండా నీ పేరు నిలబెడతాడు మల్లయ్యా అని" అని నేను పదవ తరగతి ఫస్టు క్లాసులో పాసైన రోజున మా నాన్నకు చెప్పాడు. కాబట్టి విద్యార్థులారా! ఎంత కష్టమొచ్చినా ఎంత నష్టం జరిగినా చదువుని విడవకండి.. గురువులను మరవకండి. గురువుని మించిన దైవం లేదు. చిరిగిన చొక్కా అయినా వేసుకో.. కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో అని మహానుభావుడు కందుకూరి వీరేశలింగం ఏనాడో సెలవిచ్చారు.. అని చెప్పగానే మళ్లీ చప్పట్లు మారుమోగాయి.

తల్లిదండ్రుల రుణం తలకొరివితో తీరుతుంది. ఏమిచ్చినా మనకు చదువు నేర్పిన గురువు రుణం తీర్చుకోలేం. కానీ మనం నేర్చుకున్న విద్యను పది మందికి పంచితే ఆవగింజంతైనా తీర్చుకుంటామని నా అభిప్రాయం. అందుకే నేను మన మండలంలో ప్రతి ఒక్కరికీ అందుబాట్లో ఉండేలా అత్యాధునికమైన వసతులతో జ్ఞాన సంపదను పెంచే అన్ని రంగాల పుస్తకాలు అందుబాటులో ఉండే విధంగా మోడరన్ లైబ్రరీ నా సొంత డబ్బులతో నిర్మించి ఈ పాఠశాలకు ఎంతో సేవ చేసిన రాములు మాస్టారు పేరు నామకరణం చేసి ప్రజలకు అంకితం ఇస్తున్నాను" అని చెప్పగానే ప్రాంగణం అంత లేచి నిలబడి చప్పట్ల మోత మోగించారు. నా గుండెల్లో తీపి గురుతుల జాబితాను పెంచారు.

# పర్యాటకుల్ని ఆకర్షిస్తున్న అలాస్కా గల్ఫ్

షేక్ అబ్దుల్ హాకీం జాని

ఈ విశ్వం ఆవిర్భవించిన కాలం నుండి నేటి వరకు ప్రపంచంలో అనేక వింతలు మనకు తారస పడుతూనే ఉన్నాయి. కొన్ని వింతలు అనూహ్య రీతిలో ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతాయి. మానవులు ఎంత అభివృద్ధి సాధించినప్పటికీ నేటికీ ఈ ప్రకృతిలో అంతుబట్టని అనేక అద్భుతాలు అలౌకికానందంతో పాటు వింత అనుభూతిని కలిగిస్తున్నాయి. అటువంటి వాటిలో ఒకటి అలాస్కా గల్ఫ్.

దీన్నే గల్ఫ్ ఆఫ్ అలాస్కా అని కూడా పిలుస్తారు. ఇలా రెండు సముద్ర జలాలు కలిసే విషయాన్ని పరిశీలిస్తే అనేక ఆసక్తిరమైన అంశాలు వెలుగులోకి వస్తాయి. ఇది రెండు మహా సముద్రాలు కలిసే చోటు. ఇక్కడ అట్లాంటిక్, పసిఫిక్ మహా సముద్రాలు రెండూ కేప్‌హార్న్ వద్ద అనేక కిలోమీటర్ల దూరం వరకు కలగలిసి ఉంటాయి. రెండు సముద్రాల నీటి రంగు రెండు విధాలుగా ఉండటంతో వీటి మధ్య నురుగు సరిహద్దు రేఖలా ఏర్పడి మరింత ఆశ్చర్యపరుస్తుంది. రెండు సముద్రాలు కలుస్తాయి, అయితే ఈ రెండు సముద్ర జలాలు కలవవు. విడి విడి వర్ణాలతో కనిపిస్తాయి. ఇదే ఇక్కడి వింత. ఈ రెండు సముద్రాలు అందరినీ మంత్రముగ్ధులను చేస్తుంటాయి. ఆ కారణంగానే ఈ ప్రదేశం చాలా ప్రత్యేకత సంతరించుకుంది.

రెండు సముద్రాలు కలిసే ప్రదేశం అలాస్కా గల్ఫ్. ఇది అలాస్కా దక్షిణ తీరంలో ఉంది. అలాస్కా గల్ఫ్ ఈశాన్య పసిఫిక్ మహా సముద్రంలో అలాస్కా దక్షిణ తీరంలో, అలాస్కా ద్వీపకల్పంతో పాటు యునైటెడ్ స్టేట్స్‌లోని అలెగ్జాండర్ ద్వీప సమూహం మధ్య ఉంది. అలాస్కా ఉత్తర అమెరికా ఖండానికి వాయవ్యంగా ఉన్న భూభాగం. అలాస్కా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఒకటి. ఈ రాష్ట్రం భూభాగ పరంగా అన్ని అమెరికా రాష్ట్రాల కన్నా పెద్దది. అలాస్కా ద్వీపకల్పం-కోడియాక్ ద్వీపం ద్వారా వేరు చేయబడింది. మొత్తం నదీ తీరం అడవులు, పర్వతాలు, హిమానీ నదాల కలయికతో అందాలు విరజిమ్ముతుంటుంది. ఇది జీవ వైవిధ్య పరంగా గొప్ప విలువను కలిగి ఉన్నాయి. కెంట్ స్మిత్ అనే ఫొటోగ్రాఫర్ 2010లో ఈ ప్రదేశానికి విహార యాత్రకు వచ్చినప్పుడు రెండు సముద్రాల నీటి కలయికను ఫొటో తీసి ప్రపంచానికి పరిచయం చేశాడు. ఆ తరువాత ఈ ఫొటో సామాజిక మాధ్యమాలలో హల్‌చల్ చేసింది. రెండు సముద్రాలు కలిసి వున్నట్లు కనిపించే ఈ దృశ్యం అతి పెద్ద ఓడలో ప్రయాణిస్తూనో, హెలికాప్టర్‌లోనో విహంగ వీక్షణం చేస్తే అతి సుందరంగా కనిపిస్తుంది. నేడు గల్ఫ్ ఆఫ్ అలాస్కా ప్రపంచ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రతి ఏడాది లక్షల మంది పర్యాటకులు ఈ రెండు సముద్రాల కలయికను చూడటానికి వస్తుంటారు. ఇక్కడి దృశ్యాన్ని చూసిన పర్యాటకులు ఆశ్చర్యచకితులౌతారు. కొంతమంది దాన్ని మహాద్భుతంగా వర్ణిస్తారు.

అలాస్కా గల్ఫ్ అనేది పసిఫిక్ మహాసముద్రానికి చెందిన ఒక భాగం. ఇది అలాస్కా ద్వీపకల్పం. పశ్చిమాన కొడియాక్ ద్వీపం నుండి అలెగ్జాండర్ ద్వీప సమూహం వరకు విస్తరించి ఉంది. ఇక్కడ గ్లేసియర్ బే, ఇన్‌సైడ్ పాసేజ్ ఉన్నాయి. అలాస్కా గల్ఫ్ తీర ప్రాంతం అడవులు, పర్వతాలు, అనేక హిమానీ నదాలతో నిండి వుంది. అలాస్కా అతిపెద్ద హిమానీ నదాలు మలాస్పినా గ్లేసియర్, బేరింగ్ గ్లేసియర్. అట్లాంటిక్, పసిఫిక్ మహాసముద్రాలు రెండు కలసి వున్నప్పటికీ నీటి రంగు రెండు వర్ణాలలో ఉంటుంది. ఇక్కడి హిమానీ నదులు కరిగి ఆ నీరు సముద్రంలో కలవడంతో రెండుగా కనిపిస్తాయి. రెండు సముద్రాల నీటి రంగు రెండు విధాలుగా ఉండటం వల్ల వీటి మధ్య ఒక సరిహద్దు రేఖలా కనిపిస్తుంది. అయితే ఈ రేఖ స్థిరంగా ఉండదు. వాతావరణం, ఆటుపోట్లకు అనుగుణంగా మారవచ్చు. కొన్ని సమయాలలో ఈ రేఖ కొంతసేపు దాదాపు చెదిరిపోయిన సందర్భాలు కూడా లేకపోలేదు. రెండు సముద్రాల నీరు రెండు వర్ణాలలో ఉండటం వల్ల విడివిడిగా, రెండుగా కనిపిస్తాయి.


అట్లాంటిక్ మహాసముద్రం నీరు పసిఫిక్ మహాసముద్ర జలాల కంటే ఉప్పగా ఉంటాయి. ఆ కారణంగా ఈ నీరు దట్టమైన వర్ణాన్ని కలిగి ఉంటాయి. పసిఫిక్ మహాసముద్రం నీరు లేత నీలం వర్ణంలో ఉప్పు రహితంగా ఉంటాయి. ఇవి రెండు మహా సముద్రాలు కలవడం కాదు.. రెండు వేర్వేరు జలాలు అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన ఓషనోగ్రఫీ ప్రొఫెసర్ డాక్టర్ కెన్‌బ్రూలాండ్ పలు పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో అలాస్కాలోని హిమానీ



నదుల నీరు కరిగి పసిఫిక్ మహాసముద్రంలోని హిమానీ నదుల నీరు కరిగి పసిఫిక్ మహాసముద్రంలోకి పెద్ద ఎత్తున చేరడం వల్ల దాని వర్ణం ఒక విధంగానూ, అట్లాంటిక్ మహాసముద్రం నీరు ఉప్పగా ఉండటం వల్ల దాని జలాలు మరో వర్ణంలోనూ కనిపిస్తున్నట్లు తేల్చి చెప్పారు.

లేత నీలం రంగులో కనువిందు చేసే హిమానీ నదుల నీరు ఒకవైపు, ముదురు నీలం రంగులో ఉండే అట్లాంటిక్ ఉప్పు సముద్రపు నీరు మరోవైపు ఉంటాయి. పసిఫిక్ మహాసముద్రం నీరు లేత నీలంగా ఉప్పుశాతం తక్కువగా ఉంటాయి. ఈ నీరు హిమానీ నదాల నుండి రావడం వల్ల ఈ గుణాన్ని కలిగి వుంటాయి. నీటి సాంద్రతలో వ్యత్యాసం కారణంగా రంగు వ్యత్యాసం ఏర్పడుతుంది. నీటి సాంద్రత, ఉష్ణోగ్రత, లవణీయత స్థాయిలలోని వైవిధ్యం కారణంగా నీరు ప్రత్యేకంగా కనబడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రెండు సముద్రాల జలాలు ఢీ కొట్టుకున్నప్పుడు కొంత నురుగు ఉత్పత్తి అయి ఒక రేఖలా ఏర్పడుతుంది. సూర్యకాంతిలో ఒకవైపు ఉప్పునీరు, మరోవైపు హిమానీ నదాల మంచినీరు విభిన్న సాంద్రతను కలిగి ఉండటం వల్ల రెండు సముద్రాల వలె భిన్న వర్ణాలలో నీరు కనిపిస్తుంది. ఈ దృశ్యం ప్రపంచ పర్యాటకుల్ని ఆశ్చర్యపరచడం వల్ల ప్రపంచ వింతగా మారింది.

దీన్ని రెండు సముద్రాలు కలిసిన చోటు అంటే కొందరు అంగీకరించరు. ఇది హిమానీ నదాలు సముద్రంలో కలిసే చోటు అని చెప్పేవారు కూడా లేకపోలేదు. ఏదైనా రెండు ద్రవాలు కలవాలంటే వాటి సాంద్రత, లవణీయత, ఉష్ణోగ్రత ఒకేలా ఉండాలి. అప్పుడు




మాత్రమే ఆ రెండు ద్రవాలు కలుస్తాయి. ఇక్కడ సముద్రంలో ఉన్న నీళ్ల సాంద్రత, ఇందులో కలిసిన నది నీళ్ల సాంద్రత కంటే ఎక్కువ. సముద్ర నీటి కంటే నది నీటిలో ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఆ కారణంగానే ఈ రెండు కలవకుండా రెండు వర్ణాలలో కనిపిస్తాయని కొందరి వాదన. ఈ ప్రాంతంలో నీళ్లు ఒకే రంగులో ఉండి కలిసిపోవాలంటే వీటి సాంద్రత, లవణీయత, ఉష్ణోగ్రత సమానంగా ఉంటేనే కలుస్తాయి. ప్రపంచ శాస్త్రవేత్తలు సంవత్సరాలుగా ఈ రెండు సముద్రాల కలయికపై పరిశోధనలు చేస్తున్నారు.

కొన్ని సందర్భాలలో బలమైన గాలులు, అలలు, ప్రవాహాల ప్రభావం వల్ల రెండు మహా సముద్రాలు కూడా కలిసిపోవచ్చు. అలాస్కా గల్ఫ్ లోతుకు సంబంధించిన విషయం తెలిస్తే విస్మయాన్ని కలిగిస్తుంది. సగటు లోతు 1500 మీటర్లు, గరిష్ఠంగా 4000 మీటర్ల లోతుతో ఇది ప్రపంచంలోని లోతైన నీటి వనరులలో ఒకటిగా భాసిల్లుతోంది. గల్ఫ్ ఆఫ్ అలాస్కా లోతులను అన్వేషించడంపై కూడా అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. గల్ఫ్ ఆఫ్ అలాస్కా ఒక విభిన్నమైన సముద్ర పర్యావరణ వ్యవస్థకు మారుపేరు. సాల్మన్‌తో సహా పలు రకాల చేప జాతులకు నిలయంగా ఉంది. సముద్రపు ఒట్టర్లు, సీల్స్, తిమింగలాలు వంటి సముద్రపు క్షీరదాలకు ఇది ఒక ముఖ్యమైన నివాస స్థలం. అలాస్కా గల్ఫ్ ప్రాంతంలో తుపానులు, భూకంపాలు కూడా సంభవిస్తుంటాయి. ఇక్కడి నీటి అడుగు భాగాన అగ్నిపర్వతాలు కూడా ఉన్నాయి. స్థానిక ప్రజలకు చేపల పరిశ్రమ మంచి ఆదాయాన్ని అందిస్తుంది. 'మనిషికో బుద్ధి మహిలో సుమతి' అన్నట్లు ఈ జలాలకు మహిమలను అంటగట్టి, మతాలను ఆపాదించుకుని ప్రచారం చేసుకునే వాట్సప్ యూనివర్సిటీ మేధావులు కూడా లేకపోలేదు. ఎవరి పిచ్చి వారికి ఆనందం అని భావించి వారి మానాన వారిని వదిలేద్దాం. ●

## చిత్రం, శిల్పం... అజరామరం

**ప్రతిభ,** వ్యుత్పత్తి, అభ్యాసం.. ఈ మూడింటితో రచయిత(త్రు)లుగానీ, కవులు/కవయిత్రులుగానీ రాణిస్తారు. మనసులోని ఊహల ప్రేరణతో ఊహాచిత్రాన్ని సౌందర్యారాధకులు కవితాగానం చేస్తే అదే సౌందర్యాన్ని అన్వేషిస్తూ మనోచిత్రంగా మనసులో అందంగా రూపొందిన బొమ్మను కళాత్మకంగా తీర్చిదిద్దిన కళను శిల్పకళ అంటారు. చిత్రకారులు చిత్రాలు గీయడంలో శిల్పకారులు తమ ఊహాలోకంలో శిల్పకారులుగా ప్రతిభతో అందమైన బొమ్మలను సృజనాత్మకతతో అందంగా శిల్పిస్తారు. శృంగారం, విషాదం, హాస్యం ఏదైనాగానీ, నవరసాలొలికిస్తూ మేళవిస్తూ మంచి శిల్పాలను రూపొందించగలరు. చిత్రకారులు, శిల్పులు తమ ప్రతిభకు కృషి తోడైతే విజయాలను సాధించగలరు. చిత్ర, శిల్పకళలు దేశ సంస్కృతికి, జాతి జీవ సంస్కృతికి దర్పణమై కళలకు కాణాచి అయిన మన దేశంలో ఎంతో మంది వర్ధమాన చిత్రకారులు చిత్రాలను చిత్రీకరించడంలో, సృజనాత్మకతతో శిల్పాలను ముచ్చటగా రూపొందించే



శిల్ప చాతుర్యంలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

'లైఫ్ ఈజ్ షార్ట్ బట్ ఆర్ట్ ఈజ్ ఫరెవర్' అన్నట్టు వారి జీవితం నేడు నటనలో జీవించే ఎందరో నటులున్నట్టే చిత్ర, శిల్ప కళలలో జీవించి, దేశ సంస్కృతిని ప్రతిబింబింపజేస్తూ తాదాత్మ్యం చెందే చిత్రకారుల జీవితం, జీవనం అజరామరం అని చెప్పవచ్చు.

**- యలమంచిలి శివాజీ**

# న్యాయమైన ఆహారం కోసం?

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

**మనం జీవించి వుండాలంటే ఆహారం ఎంతో అవసరం. ఆహారం సంపాదించాలంటే ఏదైనా వృత్తి చేపట్టాలి. ఏదో ఒక పని చేయాలి. అలా వృత్తిని చేపట్టమని శాస్త్రాలు అనుమతిస్తున్నాయి. అయితే ఆ చేసే పని నింద్యం కారాదు.**

అవినీతి, అధర్మం, అన్యాయంతో కూడిన పనులు శాస్త్ర సమ్మతం కావు. అది నింద్యమైనది, పాపభూయిష్టం. చేసేవానికి చేటు తెస్తుంది. నరకంలో పడతోస్తుంది. కాబట్టి చెడు పనులను ఎవ్వరూ చేయరాదు, ప్రోత్సహించరాదు. అక్రమార్గంతో పంచభక్ష్య పరమాన్నం ఆరగించినా అది జీర్ణం కాదు. క్లేశాన్ని కలిగిస్తుంది. న్యాయంగా సంపాదించిన కొద్ది ధనంతోనే అటుకులు తిన్నా కూడా ఆ ఆహారం పటుతరమై తిన్నదానికి శ్రేయాన్ని చేకూరుస్తుంది. ఇక్కడ మహాభారత సమయంలో జరిగిన ఒక సన్నివేశాన్ని గుర్తు తెచ్చుకుందాం.

కురుక్షేత్ర యుద్ధ సమయంలో అర్జునుడి బాణాలచే భీష్మపితామహుడు పడిపోగా, ఆయన విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా అంపశయ్య ఏర్పాటు చేశాడు. భీష్మునికి స్వేచ్ఛా మరణం కలిగివుండటం వలన ఆయన ఉత్తరాయనం వరకూ వేచి వుండాలనుకుని ఆ అంపశయ్యపై పడుకొని విశ్రాంతి తీసుకుంటూ వున్నాడు.

ఆ సమయంలో ఎందరో వచ్చి వారిని దర్శించుకునేవారు. వారికి భీష్ముడు చక్కని బోధలు చేస్తూ వుండేవారు. ఆ బోధలు జనులు ఎంతో ఆసక్తిగా వింటూ వుండేవారు.

శ్రోతలలో పాండవులు, ద్రౌపది, ఇంకా ఎందరో పెద్దలు అక్కడకు వచ్చి అంపశయ్య చుట్టూ చేరి నిశ్శబ్దంగా, బాహ్య ప్రపంచాన్ని మరిచిపోయి ఏకాగ్రతతో వింటూ వుండేవారు.

ఇలా చెబుతూ వుండగా– ఒక రోజున ద్రౌపది భీష్మాచార్యుల మాటలు వింటూ వింటూ పెద్దగా పక పక నవ్వింది.

ఆమె ఎందుకలా నవ్విందో ఎవరికీ అర్థం కాలేదు. ఎవరికీ అంతుపట్టలేదు. భీష్ములవారికి పరమ ఆశ్చర్యం కలిగి, బోధన నిలిపివేసి "అమ్మా, ఎందుకు నవ్వావు?" అని ప్రశ్నించాడు.

అందుకామె



"గురుదేవా, ఆనాడు కౌరవ సభలో దుశ్శాసనుడు నా జుట్టు పట్టుకుని సభలోకి ఈడ్చుకొని వచ్చి అవమానం చేయడానికి సిద్ధపడగా పక్కనే కూర్చుని వున్న మీరు ఒక్క మాటైనా చెప్పలేదేమి? ఒక్క ధర్మ వాక్యమైన చెప్పి ఆ దుష్టుని నివారించలేదేమి? ఇప్పుడు ఇన్ని ధర్మాలు చెబుతున్న మీరు అప్పుడు నోరెత్తలేదు. ఆ విషయం జ్ఞాపకానికి రాగా నవ్వు వచ్చింది" అని చెప్పగా భీష్ముడు–

"ద్రుపదపుత్రీ, నీవు అన్నది పరమ సత్యం. అప్పుడు నేనేమీ పలుకలేదు. దుర్యోధనుని పాపిష్టి సొత్తు తిని నా రక్తం చెడిపోయినందువల్ల దాని ప్రభావం కలిగిన నా మెదడు సరిగా పనిచేయలేదు. మంచి భావాలు నాకు స్ఫురించలేదు. ఈరోజు అర్జునుని బాణాలతో నా చెడు రక్తమంతా కారిపోగా, మంచి రక్తం మిగిలింది. ఈ కారణంగా నాకు ఇప్పుడు చక్కని ధర్మబోధ స్ఫురిస్తోంది.

భీష్ముని మాటలు మనం సదా గుర్తుంచుకోవాలి. అన్యాయంగా ఆర్జించిన ధనంతో తెచ్చుకొన్న ఆహారం మన నాలుకకు రుచికరమైనా మన హృదయానికి శ్రేయస్కరం కాదు. న్యాయార్జితమైన ఆహారాన్నే మానవుడైనవాడు స్వీకరించాలి. దాని వలన రక్తశుద్ధి, రక్తశుద్ధిచే చిత్తశుద్ధి, చిత్తశుద్ధిచే మోక్షసిద్ధి చేకూరుతాయి. కనుక ఆహారం కోసం నింద్యంకాని పనులను మాత్రమే చేయాలని పెద్దలైనవారు చెబుతుంటారు. నింద్య కర్మల వలన ప్రతిఫలంగా జీవులకు దుఃఖమే కలుగుతుంది.

పాపం వలన దుఃఖం, పుణ్యంచే సంతోషం, జ్ఞానం వల్ల మోక్షం లభిస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే కదా! ఏ క్షేత్రంలోనైనా పాపం పనికిరాదు. అపకారం పనికిరాదు. అన్యాయం, అధర్మం, అవినీతి పనికిరాదు.

నిప్పులో వేలు పెట్టి తర్వాత పశ్చాత్తాపపడితే ప్రయోజనం లేదు. విశ్వాసానికి తల ఒగ్గి ప్రవర్తించాలి. సత్కర్మయే తనను సదా రక్షిస్తుందని గ్రహించాలి. ✦



# ద్వారాలు ఎన్ని ఉండాలి?

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458

జి.అశోక్ – బాలానగర్

**ప్రశ్న:** మీరు చెప్పిన ప్రకారం ద్వారాలు ఏర్పాటు చేసాం. నైరుతి గదికి, ఈశాన్య గదికి మూడు ద్వారాలు వుండకూడదని ఓ వాస్తు పుస్తకంలో చదివాను. అది నిజమేనా? మా సందేహం తీర్చగలరు.

**జవాబు:** ద్వారాలు ఉచ్ఛస్థానంలో అమర్చగలిగితే అవసరాన్ని బట్టి మూడు ద్వారాలు ఏ గదికైనా అమర్చుకోవచ్చు. అయితే ఇంటి మొత్తం ద్వారాల సంఖ్య సరి సంఖ్యలో వుండి 10, 20 లాంటి సంఖ్యలు కాకుండా జాగ్రత్త పడాలి. ఒక తలుపు సర్దుబాటు కోసం అనువుగా వున్నచోట ఆర్చ్(కమాన్) ఏర్పరచుకోవడంలో తప్పు లేదు.

## సలహా చెప్పగలరు!

ఎస్.కమలమ్మ – నాందేడ్

**ప్రశ్న:** మా పరిస్థితిని అర్థం చేసుకొని మాకు మీ విలువైన సలహానిచ్చి మా ఆర్థికాభివృద్ధికి తోడ్పడగలరు.

**జవాబు:** మీ ఇంటికి వాయవ్యంలో వున్న బాత్‌రూమ్‌ను పూర్తిగా తీసివేయండి. దానికి పక్కనే వున్న పశువుల కొట్టంలోనే ఓ మూల బాత్‌రూమ్ ఏర్పాటు చేసుకోవచ్చు. పూజగది పక్కనే వున్న బెడ్ రూమ్‌ని దక్షిణం వైపు హాల్లోకి మార్చుకోండి. హాలుని బెడ్‌రూమ్‌లోకి షిఫ్ట్ చేయండి. పూజగదికి ఈశాన్య మూలనున్న కప్‌బోర్డ్ తీసివేసి ఉత్తర ఈశాన్యంలో తలుపు తెరిచి దానికెదురుగా గేటు తెరవండి. అంటే ఇప్పుడు ఉత్తరంలో వున్న గేటు అక్కడికి మార్చవలసి వుంటుంది. ఇప్పుడున్న పూజగదిలో పూజ చేసుకోవటానికి వీలుపడని పక్షంలో కొత్తగా మార్చిన చిన్న హాల్లో తూర్పు ఈశాన్య మూల షెల్ఫ్ ఏర్పాటు చేసి అక్కడ పూజ చేసుకోవచ్చు.

## పరిస్థితులు మారేదెలా?

ఎన్.భారతి – విశాఖపట్నం

**ప్రశ్న:** మా ఇల్లు కొండ ప్రాంతంలో నిర్మించుకున్నాం. ఆర్థిక పరిస్థితి వల్ల, వాస్తు గురించి తెలియకపోవటం వల్ల మేస్త్రీలు ఎలా చెపితే అలా ఇల్లు కట్టించుకున్నాం. ఇల్లు కట్టిన నాటి నుండి మాకు కష్టాలు మొదలయ్యాయి. మా పరిస్థితులు మారాలంటే ఏం చేయాలి?

**జవాబు:** ఉత్తరంలో కప్‌బోర్డు వున్న స్థానంలో ద్వారం, ద్వారం వున్న స్థానంలోకి కప్‌బోర్డుని మార్చండి. ఆర్థికంగా మీ పరిస్థితి మెరుగవ్వాలంటే ఈ మార్పు తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది.

## కొబ్బరి చెట్టు తీయవచ్చా?

ఎ.విద్యాసాగర్ – విజయనగరం

**ప్రశ్న:** మా ఇంటికి ఈశాన్యంలో కొబ్బరిచెట్టు వుంది. దాని పక్కనే బావి వున్నది. కొబ్బరిచెట్టు ఇప్పటికే పద్నాలుగు



అడుగులు పెరిగింది. ఆ చెట్టును తీసివేయవచ్చా? తీస్తే ఏదైనా దోషం ఉంటుందా?

**జవాబు:** కొబ్బరిచెట్టు అయినా ఈశాన్యంలో వున్నప్పుడు తీసివేయవలసిందే. దాని అంటును మీ ఇంటి దక్షిణ, నైరుతి, పశ్చిమ భాగాల్లో నాటండి. అది చిగురించగానే మీరు ఈశాన్యంలో వున్న కొబ్బరిచెట్టును తీసివేయవచ్చు.

## ఆర్థిక పరిస్థితులు మెరుగవాలంటే?

బి.గంగాభవాని – విజయనగరం

**ప్రశ్న:** మా ఇంట్లో ఆర్థిక పరిస్థితి ఏమీ బాగాలేదు. మనశ్శాంతి లేదు. ఎప్పుడు చూసినా గొడవలు. ఇంట్లో ప్రశాంతంగా వుండటానికి, మా ఆర్థిక పరిస్థితి మెరుగవడానికి ఏం చేయాలి?

**జవాబు:** మీ ఇంటి ప్లాను పరిశీలించాను. మొదట మీ పూజాగది నుండి ఉత్తర ఈశాన్యంగా ఒక తలుపు తెరవండి. మిగతా మార్పులు తర్వాత చేయవచ్చు.

## ఇంటి వాస్తు ఎలా ఉంది?

డి.వాసుకి – కాకినాడ

**ప్రశ్న:** ఇదివరకున్న ఇంట్లో ఆర్థికంగా కాస్త బాగుండేది. ఇప్పుడు మేం కొత్తగా కట్టకున్న ఇంట్లోకి వచ్చినప్పటి నుండి ఆర్థిక పరిస్థితి బాగా లేదు.

**జవాబు:** మీ ఇంటి తలుపులన్నీ ఒక దాంట్లోకి మరొకటి సగం సగం వస్తున్నాయి. తలుపులు ఒకే పోరున పెట్టలేదు. సింహద్వారాన్ని ఇప్పుడున్న కిటికీ స్థలంలోకి మార్చి కిటికీని సింహద్వారమున్న స్థలంలోకి మార్చాలి. అదేవిధంగా మిగిలిన రెండు తలుపులను కూడా కొత్త పెడుతున్న సింహ ద్వారానికి సూటిగా అమర్చాలి. ఇంతకు క్రితం మీరున్న ఇంట్లో ఆర్థిక పరిస్థితి కాస్త బాగుండేది అన్నారు. ఆ ఇంట్లో తలుపులు ఇప్పుడు సూచిస్తున్న మార్పులాగే వుంటాయి... గమనించండి.

## నష్టాలు తగ్గేదెలా?

ఎం.ఆర్.నందిత – హైదరాబాద్

**ప్రశ్న:** ఇల్లు మారిన తరువాత వ్యాపారం నష్టాలకు లోనయింది. నష్టాల నుండి కోలుకోవాలంటే ఏం చేయాలి?

**జవాబు:** మెట్లు వాయవ్య మూలలో కట్టడం వరకు సరే. ఆ మెట్లు ఉత్తరం గోడలను తగలకూడదు. ✦



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



నిర్మాణ సంబంధమైన లోన్స్ లభిస్తాయి. చెప్పుడు మాటలు విని నిర్ణయాలు తీసుకోవద్దు. దూర ప్రాంత ప్రయాణాలు కలిసి వస్తాయి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి చేకూరుతుంది. సహోదర, సహోదరి వర్గంతో మాట పట్టింపులు వచ్చే అవకాశాలున్నాయి, జాగ్రత్తగా ఉండండి. ఆర్థిక విషయాల్లో సంకట స్థితి తొలగిపోయి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది.

## వృషభం



టీచింగ్ వృత్తిలో ఉన్నవారికి ప్రభుత్వం/ ప్రైవేట్ స్కూళ్ల నుండి మంచి అవకాశాలు, ఉత్తర్వులు వస్తాయి. అర్హత కలిగినటువంటి ఉన్నత పదవికి ఎంపిక అవుతారు. దూరపు బంధువుల నుండి సలహాలు, సూచనలు తీసుకుంటారు. తప్పనిసరి పరిస్థితుల్లో చొరవ తీసుకొని కొంత మంది వ్యక్తిగత విషయాల పట్ల కఠిన నిర్ణయాలు తీసుకుని, అమలు పరుస్తారు.

## మిథునం




ఉన్నత చదువుల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. వివాహ ప్రయత్నాలు సానుకూల పడతాయి. మంచి సంబంధాన్ని, ముహూర్తాన్ని కుదుర్చుకుంటారు. చెప్పుడు మాటలు విని మోసపోయే అవకాశం ఉంది, అప్రమత్తంగా ఉండండి. వాహన భద్రత విషయంలో మెలకువలు పాటించండి.

## కర్కాటకం



వివాహ విషయంలో చొరవ తీసుకుంటారు. అనుకున్న కార్యక్రమాలలో పురోగతి సాధిస్తారు. చిన్న విషయాలకు కూడా ఎక్కువగా ప్రతిస్పందించడం మంచిది కాదని గ్రహించండి. స్త్రీలతో భేదాభిప్రాయాల వల్ల కొన్ని మంచి అవకాశాలు చేజార్చుకుంటారు. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. పిల్లల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండటం మంచిది.

## సింహం



శాంతి, సహనం వహించి చర్చలను ఫలవంతం చేసుకుంటారు. మీ ప్రయోజనాలను పరిరక్షించుకుంటారు. అందరిలో ఐక్యమత్యాన్ని తీసుకువస్తారు. పోలీస్ డిపార్ట్‌మెంటులో వున్నవారి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. టీచింగ్ వృత్తిలో వున్నవారికి అనుకూలంగా ఉంటుంది.

## కన్య



మీ పేరు మీద ఉన్న వ్యాపారాలలో స్వల్పమైన నష్టాలు ఏర్పడతాయి. చెప్పుడు మాటలు విని తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు. ప్రత్యక్షంగా వాస్తవాలను పరిశీలించి మంచి నిర్ణయాలు తీసుకోండి. తల్లి తరపు బంధువులతో మాట పట్టింపులు వస్తాయి. ప్రయాణాలు లాభిస్తాయి. సన్నిహితుల సహాయంతో వివాహ కార్యక్రమాలు ఘనంగా చేస్తారు.

## తుల




నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. సంఘసేవ కార్యక్రమాలు, అనాథ శరణాలయాలకు విరాళాలు అందచేస్తారు. ఆహార నియమాలు పాటించండి. స్నేహితుల సహకారంతో ఒక సమస్యని పరిష్కరించుకుంటారు. టీచింగ్ వృత్తిలో వున్నవారికి పదోన్నతులు లభిస్తాయి. కొందరితో ఏర్పడిన అభిప్రాయ భేదాల వల్ల మీరు అనుకున్న ఒక కార్యక్రమం మధ్యలోనే ఆపివేయాల్సి వస్తుంది.

## వృశ్చికం



ఉద్యోగంలో స్వల్ప మార్పులు ఏర్పడతాయి. పొట్టీ వ్యాపారులకు అంతంత మాత్రంగా ఉంటుంది. గృహ లోన్ ప్రయత్నాలు ఫలిస్తాయి. చిన్ననాటి మిత్రులను కలిసి నూతన వ్యాపారం ప్రారంభించాలని చర్చలు సాగిస్తారు. మీ పేరు మీద చేసే వ్యాపారాలు లాభసాటిగా గుతాయి. గొడవలకు, విభేదాలకు దూరంగా వుండటం మంచిది. శాంతి, సహనం వహించటం మంచిది. ఆరోగ్య సలహాలు పాటించండి.సొంత వైద్యం పనికిరాదు.

## ధనుస్సు



ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. వ్యాపారంలో, వ్యక్తిగత జీవితంలో మార్పులు వస్తాయి. ఆర్థిక విషయాల్లో సంకట స్థితి తొలగిపోతుంది. విద్యా, వ్యాపార, ఉద్యోగాల్లో మంచి అవకాశాలు లభిస్తాయి. దూర ప్రాంత ప్రయాణాలు లాభిస్తాయి. దైవ దర్శనం చేసుకుంటారు. శుభ కార్యాల్లో చురుగ్గా పాల్గొంటారు. సంతాన విషయంలో కఠినంగా ప్రవర్తించడం అనివార్యంగా భావిస్తారు. ఆరోగ్యం జాగ్రత్త.

## మకరం



బంధువులతో, అయినవాళ్లతో మాట పట్టింపులు కొనసాగుతాయి. వివాహ, శుభ కార్య విషయాలలో అనుకోని విధంగా సమస్యలు ఎదురవుతాయి. వాటిని సమర్థవంతంగా దాటడానికి అధికంగా శ్రమిస్తారు. కొంత మంది వ్యక్తులతో పరిచయాలు అనుకోని పరిణామాలకు దారి తీస్తుంది. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. లోన్లు మంజూరవుతాయి.ఆరోగ్య విషయంలో మెలకువలు పాటించండి.

## కుంభం




టీచింగ్ ప్రొఫెషన్‌లో వున్నవారికి అనుకూలంగా ఉంటుంది. నూతన అవకాశాలను అందుకుంటారు. అర్హతకు తగినటువంటి ఉద్యోగం సంపాదించుకుంటారు. ధన సంపాదన కోసం అహర్నిశలు కష్టపడతారు. అయితే శ్రమకు తగిన ఫలితాలు పూర్తి స్థాయిలో రాకపోవచ్చు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. మానసిక ఉత్తేజం కలిగి వుంటారు.

## మీనం





నూతన ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి. స్త్రీలతో విరోధం, స్త్రీల సహాయ నిరాకరణ ఒక కార్యక్రమంలో చికాకు కలిగిస్తుంది. శుభ కార్యాల్లో వారి వైఖరి ఆలోచింప చేస్తుంది. పిల్లల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండండి. పోలీసు శాఖలో వున్నవారికి పని ఒత్తిడి పెరుగుతుంది. ఉన్నత పదవుల్లో వున్నవారితో వేధింపులు తప్పకపోవచ్చు. ఆరోగ్య, ఆహార నియమాలు క్రమం తప్పకుండా పాటించడం అవసరం.

# ఈ వారం 'కార్టూన్స్'


.. ఇక నా వల్లకాదు.. ఏదో రోజు ఈ బ్యాట్ మీద పడి సూసైడ్ చేస్కుంటా!
Zakir...


ఎవడినైనా అడుగుతా!
ఈరోజు అడ్డే మూడ్ లేదు.. రేపు రా పో!!


"మనవరాలిని ఆడించడానికేగా" అంటున్నదండీ ఈ సుబ్బి..!!
సెక్యూరిటీ చెక్
అమెరికాకు
Zakir...



ఈ చిత్రాలన్నీ ఏదో ఆర్ట్ గ్యాలరీలోనివి... అనుకుంటే మీరు పొరపడినట్లే. స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో మెట్రో స్టేషన్లలోని ఫొటోలివి. అక్కడి స్టేషన్లన్నీ ఆర్ట్ గ్యాలరీని తలపించేలా వుంటాయి. ఈ స్టేషన్లలోని ప్లాట్‌ఫామ్‌లు, గోడలు.. ఇలా ప్రతి ఒక్కటీ విభిన్నమైన పెయింటింగ్‌లతో అందరినీ ఆకట్టుకుంటాయి. స్వీడన్ దర్శనీయ స్థలాల్లో స్టాక్‌హోమ్ మెట్రో ఒకటిగా మారింది.

## ఫోటో ఫీచర్



